ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శనివారం | 01-08- 2026 | సంపుటి: 17, సంచిక: 119, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ


### పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు

# టామ్‌కాందే బాధ్యత

## స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఏటీసీల్లో అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం

డిమాండ్‌కు తగినట్లు నర్సింగ్ కళాశాలల ఏర్పాటు

శక్తి శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూలై 31 (ప్రజాకలం) :
విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలతో పాటు ఉద్యోగార్థులకు అవసరమైన పాస్‌పోర్టు, ఆయా దేశాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను టామ్‌కాం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శక్తి శాఖపై ఆ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్య ప్రాచ్య దేశాలకు వెళుతుంటారని, ఈ క్రమంలో వారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఇబ్బందిపడుతున్నారని సీఎం తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వారికి పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు వారు వెళ్లే దేశాల్లోని మ్యాన్ పవర్ కంపెనీలతో ఒప్పందాలను టామ్‌కాం చేసుకోవాలని సీఎం సూచించారు. విదేశీ కంపెనీలతో టామ్‌కాం ఒప్పందం చేసుకోవడం ద్వారా అక్కడకు వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే చర్చలు జరపడానికి, వారికి న్యాయం చేయడానికి వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. కార్మికులను విదేశాలకు తరలించే ఏజెంట్ల వివరాలు సేకరించి.. వారు పంపించే ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయాలని సీఎం సూచించారు.


తరువాయి 2వ పేజీలో...




### ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం

# సహించం

లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు తప్పవు

ఇప్పటికే కంపెనీలకు పలుమార్లు నోటీసులు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పురోగతి లేని కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం సిద్ధం

85 వేల ఎకరాల లక్ష్యంలో ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాలే..

కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి

రైతులు ముందుకొస్తుంటే కంపెనీలు వెనుకబడటం ఆమోదయోగ్యం కాదు

మొక్కల కొరతకు అవకాశం ఇవ్వొద్దు..

అవసరమైతే ఇతర కంపెనీల నుంచి కొనుగోలు చేయాలి

ఆయిల్ ఫెడ్‌కూ మినహాయింపు లేదు..

పనితీరు లేకుంటే జిల్లాలు తగ్గిస్తాం

నిర్మాణంలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్లు వేగంగా పూర్తి చేయాలి

హైదరాబాద్, జూలై 31 (ప్రజాకలం) :
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సెక్రటరీ శ్రీ కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ శ్రీ కె. సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.


తరువాయి 2వ పేజీలో...


### తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను

# మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన ట్రస్ట్ సమావేశం

చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష - ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయం

అత్యవసర వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 31: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ ఫండ్ ను సద్వినియోగం చేసుకునేలా కమిటీ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు



ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పరిశీలించి, ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపట్టాలని సూచించారు. ట్రస్ట్ కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు అవసరమైన సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు ప్యాకేజీ రేట్లు, ఆసుపత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి ట్రస్ట్‌కు సూచనలు అందజేయాలి. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్య


తరువాయి 2వ పేజీలో...


### కలం కౌంటర్



డా. దత్తాత్రేయుడు నోరికి పద్మభూషణ్ రావడం దేశానికే

# గర్వకారణం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



హైదరాబాద్, జూలై 31 (ప్రజాకలం) :
తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు (వైద్యం), ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. దత్తాత్రేయుడు నోరికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను శ్రీ అమిత్ షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్య ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.


తరువాయి 2వ పేజీలో...


### రాష్ట్రంలోనే ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా

# తీర్చిదిద్దుతాం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయండి
- కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి పిలుపు



పాలేరు జులై 31(ప్రజా కలం న్యూస్ )
రాష్ట్రంలోనే ఏదులాపురం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్ర సచివాల యంలో తన కార్యాలయంలో ఏదులాపురం మున్సిపల్ కౌన్సిలర్లతో మంత్రి సమావేశమ య్యారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆలోచన, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని, ప్రజలు ముఖ్యం ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా పేదోడి సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలన్నారు.


తరువాయి 2వ పేజీలో...




### ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్

# నిర్మాణాలకు శ్రీకారం

టెండర్ ప్రక్రియ ప్రారంభం.. నిర్మాణాలకు సిద్ధమైన ప్రభుత్వం

మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తి

ఆధార్ ఒక్కటే కాదు.. నివాస ధృవీకరణకు పలు పత్రాలు చెల్లుబాటు

ఇల్లు రాకపోతే 10 వేల ఈఎండీ వంద శాతం తిరిగి చెల్లింపు

దరఖాస్తులకు ఆగస్టు 10 చివరి తేదీ : మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 31 (ప్రజాకలం) :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి గారు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది పూర్తికాగానే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.
హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాల గుర్తింపు పూర్తయిందని, దశలవారీగా మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని విస్తరిస్తామని చెప్పారు. పేద కుటుంబాలు కూడా హైదరాబాద్‌లోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తే కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేసినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, ప్రస్తుతం భారీగా వస్తున్న దరఖాస్తులే ఇందిరమ్మ టవర్స్‌పై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.


తరువాయి 2వ పేజీలో...


### తెలంగాణలో వైన్ టూరిజం

# అభివృద్ధికి అవకాశాలు

అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం

ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు

హైదరాబాద్, జూలై 31:
తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు.




తరువాయి 2వ పేజీలో...

### పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు

# టామ్‌కాందే బాధ్యత

మొదటి పేజీ తరువాయి...

ఈ వ్యవహారాల పర్యవేక్షణకు టామ్‌కాంకు మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని సీఎం తెలిపారు. ఉద్యోగార్థులకు లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జర్మనీ, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. విదేశీ భాషలు నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రీలొకేటెడ్ చెట్లను నాటాలని సీఎం సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లే, బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందేవారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని, భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. ఏటీసీల్లో జూం సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం సూచించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని సీఎం సూచించారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు.

పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, శక్తి కార్యదర్శి హరిచందన, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నిర్మలా కాంతి వెస్లీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం

మొదటి పేజీ తరువాయి...

ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైందని, అంటే లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై అత్యంత నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తరఫున ఇప్పటికే పలుమార్లు కంపెనీలతో సమావేశాలు నిర్వహించి, ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని మంత్రి అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న సమయంలో కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

**పలుమార్లు నోటీసులు ఇచ్చినా తీరు మారని కంపెనీలు**

పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోహియా కంపెనీకి, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాలలో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

అదేవిధంగా పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న తిరుమల కంపెనీకి, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రియూనిక్ కంపెనీకి, హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పనిచేస్తున్న రామ్ చరణ్ కంపెనీకి మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోద్రెజ్ కంపెనీకి రెండు సార్లు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అలాగే విశ్వతేజ్ కంపెనీకి ఐదు సార్లు, కేన్ బయో కంపెనీకి ఆరు సార్లు, పతంజలి కంపెనీకి ఆరు సార్లు, మాట్రిక్స్ కంపెనీకి ఐదు సార్లు, సువేన్ ఆగ్రో కంపెనీకి మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపెనీలలో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పనితీరు లేకుంటే జిల్లాల పరిధి తగ్గింపు**

పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ, కంపెనీలు ఇంకా బాధ్యతాయుతమైన వైఖరి కనిపించడంలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్ష్య సాధనలో వెనుకబడిన ఏ కంపెనీ అయినా వారి పరిధిలోని జిల్లాలను తగ్గించడానికైనా లేక పూర్తిగా తొలగించడానికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని, అలాగే మెరుగైన పనితీరు కనబరిచే కంపెనీలకు మరికొన్ని జిల్లాలను అప్పగించే ఆలోచనకు ప్రభుత్వం సిద్ధం ఉందని అన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనుల్లో పురోగతి లేకుంటే ఆ సంస్థ పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు లేక కొత్త సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**మొక్కల కొరత ఉండకూడదు**

సమావేశంలో మొక్కల లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఎదురయ్యే అవకాశం ఉన్న కంపెనీలు ముందస్తుగా ఇతర కంపెనీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

రైతు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు.

**రైతులకు క్షేత్రస్థాయిలో పూర్తి సహకారం అందించాలి**

కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు.

**ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం వేగవంతం చేయాలి**

యూనిట్ల ఏర్పాటులో జాప్యం కూడా ప్రభుత్వం సహించదని, ఇప్పటికే కావాల్సింత సమయం కంపెనీలకు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

### తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను

# మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి...

సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థ, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, సంబంధిత ఆసుపత్రులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఉద్యోగులు ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేలా ట్రస్ట్ పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయాలని సిఎస్ సూచించారు.

ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ మహేశ్ దత్ ఎక్కా, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్,హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ జెండగే హనుమంత్ కొండిబా, కార్యదర్శులు శ్రుతి ఓజా, దివ్య, సిక్తా పట్నాయక్, టి.ఎన్.జీ.ఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీ.జీ.ఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ సెక్రెటేరియేట్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస రెడ్డి, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి, పీఆర్ టీయూ కు చెందిన దామోదర్ రెడ్డి, తెలంగాణా యూ.టి.ఎఫ్ కు చెందిన చావా రవి, ఎస్ టి యు అధ్యక్షులు సదానంద గౌడ్, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం మహిళా అధ్యక్షురాలు ఉమా దేవి, ఎస్ టి ఎఫ్ అధ్యక్షులు డి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు చివరి వారంలో ఇందిరమ్మ టవర్స్

# నిర్మాణాలకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వానికి చెందిన వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో టవర్స్ నిర్మించి, ప్రతి లబ్ధిదారునికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు.

పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపు, నిర్మాణం చేపడుతున్నామని, అందువల్ల ఏ నియోజకవర్గానికి చెందిన వారు ఆ నియోజకవర్గంలోనే దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

దరఖాస్తుదారులు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డు మాత్రమే కాకుండా ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి పత్రాలను కూడా సమర్పించవచ్చని మంత్రి తెలిపారు. దీంతో ప్రజలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుల గడువును ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ఆలోచన లేదని, ఆగస్టు 10లోపు తప్పనిసరిగా దరఖాస్తులు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇంటి కోసం చెల్లించే రూ.10 వేల ఈఎండీ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హత లభించని వారికి వంద శాతం మొత్తం తిరిగి చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈఎండీ చెల్లిస్తే, అదే బ్యాంకు ఖాతాకు నేరుగా రీఫండ్ జమ అవుతుందని స్పష్టం చేశారు.

ఈ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో పారదర్శకత, బాధ్యతతో ముందుకు సాగుతుందని, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలకు మేలు జరిగేలా, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తోందన్నారు. ఎవరి పట్లా కక్షపూరిత వైఖరి లేకుండా, సామాన్య ప్రజలు హర్షించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనే ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# డా. దత్తాత్రేయుడు నోరికి పద్మభూషణ్ రావడం దేశానికే గర్వకారణం

మొదటి పేజీ తరువాయి...

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశారు.

కేవలం ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే నిజమైన మౌన సాధకులకు, కర్మయోగులకు నేడు ఈ జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రోగుల సంక్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం ఒక వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశ ప్రగతికి దిశానిర్దేశం చేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన శ్రీ అమిత్ షా... డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలం పాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షిస్తూ తన లేఖను ముగించారు.

### రాష్ట్రంలోనే ఏదులాపురం మున్సిపాలిటీని

# మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

ప్రతి కౌన్సిలర్ తన డివిజన్‌లో నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి వారి విశ్వాసాన్ని చూరగొనాలని, ప్రజా ప్రయోజనాలే ప్రతి ప్రజాప్రతినిధి ప్రధాన ధ్యేయంగా ఉండాలని అన్నారు. స్థానికంగా పరిష్కరించలేని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం తరఫున తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మొదటి విడతలో రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అనంతరం రెండో విడతలో మరో రూ.100 కోట్లు కేటాయించి మిగిలిన మౌలిక వసతుల పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో స్మశాన వాటికల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు తగిన స్థలాలను గుర్తించాలని సూచించారు. స్థలాలు అందుబాటులోకి వచ్చిన వెంటనే అత్యాధునిక వసతులతో స్మశాన వాటికలను నిర్మిస్తామని చెప్పారు. అలాగే ప్రజల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో ఆధునిక బస్సు షెల్టర్లను కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు.

పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన నిరుపేద కుటుంబాలకుఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పారదర్శక పాలనకు ప్రజాప్రతినిధులు సహకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీమన్నారాయణ చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్త కమిటి బాధ్యులు చెన్నా వెంకన్న, అంబాల సైదులు, పెంద్ర అంజయ్య, చెన్నా విజయ్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గోగుల అంజయ్య, కొండపల్లి రాములు, అంబాల సత్యనారాయణ, దొంతగాని వీరబాబు, బెజవాడ శ్రీకాంత్, మహిళా భక్తులు పాల్గొన్నారు

### తెలంగాణలో వైన్ టూరిజం

# అభివృద్ధికి అవకాశాలు

మొదటి పేజీ తరువాయి...

సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ పర్యాటక విధానం 2025–30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌థ్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు.

అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.

### మెట్రో ప్రయాణీకుల సౌకర్యవంతమైన

# ప్రయాణానికి మరిన్ని చర్యలు చేపట్టాలి

### హెచ్‌ఎంఆర్‌ఎల్ బోర్డు అఫ్ డైరెక్టర్ల సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ఆదేశం



హైదరాబాద్, జూలై 31 : మెట్రో రైల్ ప్రయాణీకులు సురక్షితంగా సులభతరంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరడానికి తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ఆదేశించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ బోర్డు అఫ్ డైరెక్టర్ల చైర్మన్ గా శ్రీ సంజయ్ జాజు తొలి సారిగా మెట్రో రైల్ నిర్వహణ, అభివృద్ధిపై సమీక్షించారు. బోర్డు అఫ్ డైరెక్టర్ల సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగింది.

మెట్రో, ఆర్టీసీ వంటి ప్రజా రవాణా వ్యవస్థలు అన్నిటిలోను ఒకే టికెట్ పై ప్రయాణించే విధానాన్ని అమలు చేసేలా తగు ప్రణాళిక ను రూపొందించాలని ఆయన సూచించారు. ఉమ్మడి యాప్ ని అభివృద్ధి చేసేలా టీజీఎస్ ఆర్టీసీతో చర్చించాలని తెలిపారు. అలాగే మెట్రో ప్రయాణీకులకు రోజు వారీ, నెలవారీ పాస్ లను ప్రవేశపెట్టడానికి తగు మార్గాలను అన్వేషించాలని ఆయన ఆదేశించారు.

మెట్రో మొదటి దశ స్వాధీనం, రెండవ దశ అనుమతుల తాజా ప్రగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశంలో చర్చించారు. అదనపు బోగీలను వీలైనంత త్వరగా సమీకరించడానికి తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో బోర్డు అఫ్ డైరెక్టర్లు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రంజన్, రోడ్లు,రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ వికాస్ రాజ్, డీజీపీ (శాంతి భద్రతలు) శ్రీ మహేష్ భగవత్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి సిక్తా పట్నాయక్, హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ వర్క్స్, సీవరేజ్ బోర్డు ఎండీ శ్రీ కే.అశోక్ రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బి.అజిత్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు.

# చెత్తతొలగింపులో...సర్పంచ్ శరణ్య చిత్తశుద్ధి...

### బీరుసానిలో ఇంటింటికి తిరిగి సర్పంచ్ చెత్త సేకరింపు

### ఫ్రైయ్ డే రోజు.. డ్రై డే కార్యక్రమం – ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు






వెల్గటూర్, జులై 31, ప్రజాకలం : జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని బీరుసాని గ్రామంలో సర్పంచ్ కారుకూరి శరణ్య గ్రామంలో గల చెత్తను తొలగించడంలో చిత్త శుద్ధిని ప్రదర్శిస్తుంది. గ్రామంలో గల ప్రతి ఇంటికి తిరిగి అక్కడ వారు పోగుచేసిన చెత్తను సేకరించి, ట్రాక్టర్ లో డంప్ యార్డ్ కు తరలించే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది ప్రతి శుక్రవారం ( ఫ్రైడే ) రోజున ఈ'' డ్రై ''డే కార్యక్రమం నిర్వహించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడం ఇండ్లతో పాటుగా పరిసర ప్రాంతాలలో చెత్త, చెదారం పోగవ్వడం మూలంగా అక్కడ నీళ్లు నిలిచి దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉం ది. ఈ నేపథ్యంలో సర్పంచ్ శరణ్య ఫ్రైయ్ డే రోజు.. డ్రై డే కార్యక్రమం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సందేశాన్ని అందజేస్తుంది. కాగా సర్పంచ్ కు గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా సహకరించడంతో గ్రామంలో ఈ కార్యక్రమం విజయ వంతంగా ముందుకు సాగుతుంది. ఈ రోజు కూడా సర్పంచ్ శరణ్య ఆధ్వర్యంలో చెత్త తొలగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బాల రాజశేఖర్, అంగన్వాడీ టీచర్ గీత, ఆశ వర్కర్ అనూష, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాల నష్టం పై అధికారుల సమీక్ష..



మల్లాపూర్ జూలై 31 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలోని పాత ధాంరాజ్‌పల్లి గ్రామంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామానికి చెందిన మందపల్లి బాలకిషన్ నివాస గృహం కూలిపోయింది. సమాచారం అందుకున్న మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) అలువల శ్రీకాంత్ శుక్రవారం గ్రామానికి చేరుకుని గ్రామ సర్పంచ్ రోండ్ల రాజేశ్వరి రాజా రెడ్డి తో కలిసి కూలిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుం సభ్యులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకుని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గోదావరి నది ఉధృతిని పరిశీలించి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాత ధాంరాజ్‌పల్లి ఉప సర్పంచ్ గణేష్, గ్రామ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

## జగ్గసాగర్ హైస్కూల్ హెడ్మాస్టర్ ప్రభాకర్‌కు సర్పంచ్ విరమణ కార్యక్రమంలో చిరు సన్మానం



మెట్ పల్లి రూరల్, జూలై 31:(ప్రజా కలం);జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో సర్పంచ్ పుల్ల సాయగౌడ్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్గసాగర్ హైస్కూల్ హెడ్మాస్టర్ ప్రభాకర్‌ను గ్రామస్థులు, పంచాయతీ సభ్యులు చిరుసత్కారంతో గౌరవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్ల సాయగౌడ్ మాట్లాడుతూ, గ్రామ విద్యాభివృద్ధికి హెడ్మాస్టర్ ప్రభాకర్ కృషి శ్లాఘనీయమని, విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు కార్యక్రమంలో భాగంగా హెడ్మాస్టర్ ప్రభాకర్‌కు చిత్రపటం బహుమానంగా అందజేసి, విద్యారంగంలో ఆయన సేవలను గుర్తించారు. గ్రామ అభివృద్ధి, విద్య, ఆరోగ్య కార్యక్రమాల్లో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారని, ఈ సహకారం భవిష్యత్తులోనూ కొనసాగాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు

## పే స్కేల్ కోసం ఉపాధి హామీ ఉద్యోగుల పెన్‌డౌన్

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తమ చిరకాల వాంఛ అయిన పే స్కేల్ అమలును డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు



రోడ్డెక్కారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాల యం ఎదుట వారు నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ ఆందోళనతో కార్యాలయ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపో యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పథకం విజయవంతం కావడానికి నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు తమను విస్మరిస్తున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వేతనాలు, పే స్కేల్ లేకపోవడంతో తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసనలను శాంతియుత మార్గంలో ఉధృతంగా కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. ఈ నిరసనలో ఏపీఓ రమేశ్‌బాబు, జేఈ రాజయ్య, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు తొడుపునూరు సుజాత, దివ్య, సురేన్ తోపాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# దెబ్బతిన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి

### – మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 31 (ప్రజాకలం) గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెట్‌పల్లి పట్టణంలో దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు, ప్రభుత్వ భవనాలను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డుల్లో సంభవించిన నష్టాన్ని అధికారులు పరిశీలించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. 3వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఒక ఇంటి గోడలు పూర్తిగా కూలిపోయిన ఘటనను పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. అయితే16వ వార్డులో లక్ష్మీ థియేటర్ ఎదురుగా ఉన్న ఒక దుకాణంలో సీలింగ్ కూలిపోవడంతో కంప్యూటర్లు, ఫర్నిచర్ ధ్వంసమైన విషయాన్ని పరిశీలించారు. 11వ వార్డులో పెద్ద చెరువు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వరద నీరు చేరి విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, నీటిని తొలగించి మార్గాన్ని పునరుద్ధరించే చర్యలను అధికారులు చేపట్టారు. 22వ వార్డులో ప్రభుత్వ పాఠశాల భవనం గోడలకు పగుళ్లు ఏర్పడి, వర్షపు నీరు తరగతి గదుల్లోకి చేరడంతో పుస్తకాలు, ఫర్నిచర్ తడిసిపోయిన పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ సూచించారు. ప్రమాదకర ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల తలెత్తిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల నరేశ్, రెబ్బస్ మహేశ్, నాయకులు అరిసె మురళి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### బాలవాటిక-1 నుంచి 5వ తరగతి వరకు ఆఫ్‌లైన్ అడ్మిషన్లు : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జులై 31 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్‌లోని పాత ఎస్పీ కార్యాలయ భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1 (నర్సరీ) నుంచి 5వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 1 నుంచి



ఆగస్టు 14, 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి కేంద్రీయ విద్యాలయం, చెల్గల్ తాత్కాలిక క్యాంపస్, పాత ఎస్పీ కార్యాలయ భవనం, ధరూర్ క్యాంప్, జగిత్యాల చిరునామాలో సమర్పించాలని సూచించారు. బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవాటిక-3తో పాటు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకే ప్రవేశాలు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ కేంద్రీయ విద్యాలయ సంస్థ ప్రవేశ మార్గదర్శకాలు-2026-27 ప్రకారం నిర్వహించబడుతుందని, నిర్దేశిత వయోపరిమితి, ఇతర నిబంధనలు తప్పనిసరిగా వర్తిస్తాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రేషన్ కార్డు/బీపీఎల్ లేదా ఆదాయ ధృవీకరణ పత్రం (వర్తిస్తే), రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా ధృవీకరణ పత్రం/బదిలీ వివరాలు తదితర అవసరమైన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కేంద్రీయ విద్యాలయం కార్యాలయాన్ని సంప్రదించాలని లేదా కెవిఎస్ ప్రవేశ మార్గదర్శకాలు-2026-27ను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు.

## దెబ్బతిన్న రహదారులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

### – తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల ప్రతినిధి జులై 31 (ప్రజాకలం) జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతినడంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలంలో పర్యటించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మపురి మండలం నర్సయ్యపల్లి-కొత్త కొరండ్లపల్లి గ్రామాల మధ్య కల్వర్టులు తెగిపోవడంతో పాటు ఆకుసాయిపల్లి-నాగారం గ్రామాల మధ్య రోడ్‌డ్యామ్ బ్రేచ్ అయిన ప్రాంతాలను కలెక్టర్ సందర్శించారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేసి, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాకపోకలు సాగించవద్దని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో



రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం బుద్దేశ్‌పల్లి గ్రామ పరిధిలోని చెరువు మత్తడిని పరిశీలించిన కలెక్టర్, చెరువులోకి వస్తున్న వరద ఇన్‌ఫ్లో పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు భద్రతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అవస రమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలన లో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవోతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేద కులబాంధవుల సంక్షేమమే మా ధ్యేయం

### – మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ పటేల్

### – బొగ్గుల తిరుపతి కుటుంబానికి ఆర్థిక చేయూత



పెద్దపల్లి,జూలై 31(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పేద కులబాంధవుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మున్నూరు కాపు సంఘం మరోసారి తమ ఉదారతను చాటుకోగా, పెద్దపల్లి మండలం చందపల్లి గ్రామంలో మున్నూరు కాపు గ్రామ అధ్యక్షుడు గంగుల రాకేష్ పటేల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బొగ్గుల తిరుపతి కుటుంబానికి రూ. 20,500ల ఆర్థిక సాయాన్ని మున్నూరు కాపు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ పటేల్, రాష్ట్ర నాయకులు ఏలువాక రాజయ్య, అమీరిశెట్టి రామస్వామి, జిల్లా, గ్రామ నాయకులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు జడల సురేందర్ పటేల్ మాట్లాడుతూ పేద కులబాంధవులను ఆదుకోవడమే ధ్యేయంగా తామందరం పని చేస్తున్నామని స్పష్టం చేస్తూ, సొంతంగా పేర్లు ప్రకటించుకుంటే సంఘాలు కాబోవని, ప్రజాబలంతో ఎన్నికైన కమిటీకే ప్రజల్లోకి వెళ్లే హక్కు ఉంటుందని గుర్తుచేశారు. కులాభివృద్ధికి నిజంగా కట్టుబడి ఉంటే ప్రకటనలకే పరిమితం కాకుండా పోటీపడి పేదలకు ఆర్థిక సాయం చేయాలని సవాలు విసరగా, సమాజంలో మున్నూరు కాపు కులబంధువులు ఎవరు ఆపదలో ఉన్నా తమ సంఘం తక్షణమే స్పందిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. రాజయ్య పటేల్ మాట్లాడుతూ జడల సురేందర్ పటేల్ నాయకత్వంలో ఇప్పటివరకు మూడు విడతల్లో అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం జరిగిందని, చందపల్లి గ్రామ అధ్యక్షులు గంగుల రాకేష్ పటేల్ మరియు గ్రామ పెద్దల చొరవతో ఈ విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపి, కాగితాలకే పరిమిత మయ్యే నకిలీ నాయకులను కులబాంధవులు నమ్మవద్దని, వచ్చే మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసి తమ బలాన్ని నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందపల్లి మున్నూరు కాపు గ్రామ అధ్యక్షులు గంగుల రాకేష్ పటేల్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామస్వామి పటేల్, జిల్లా నాయకులు పూదరి శ్రీనివాస్, ఉప్పు రాజ్ కుమార్, వరాల సంపత్ కుమార్, గణపతి రాజేష్, యూత్ నాయకులు అమీరిశెట్టి పూర్ణచందర్, మల్క విక్రాంత్ తో పాటు గ్రామ పెద్దలు, కుల సంఘ నాయకులు లక్కాకుల లింగయ్య, పెర్క మల్లేశం, జాపతి రాజు, గాండ్ల శంకర్, జాపతి తిరుపతి, బొగ్గుల రవి, బొగ్గుల సధి, కుడిది ఉదయ్, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో మెరిసిన మెట్‌పల్లి చిన్నారి తనుష్

### భగవద్గీత 700 శ్లోకాలు కంఠస్థం చేసి స్వర్ణ పతకం సాధించిన ఘనత






మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 31 (ప్రజాకలం) పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు మాడిశెట్టి ప్రభాకర్ మనుమడు, హరీష్-అర్చన ల కుమారుడు తనుష్ అమెరికాలో నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. సంపూర్ణ భగవద్గీతలోని 700 శ్లోకాలను కంఠస్థం చేసి తన అసాధారణ జ్ఞాపకశక్తిని చాటుతూ స్వర్ణ పతకం (గోల్డ్ మెడల్) సాధించి మెట్‌పల్లి పట్టణానికి, తెలుగు సమాజానికి గర్వకారణంగా నిలిచాడు. ఈ విజయాన్ని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి దివ్య ఆశీస్సులతో అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనుష్ సాధించిన ఈ విశిష్ట విజయంపై బంధుమిత్రులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భగవద్గీత సందేశాన్ని చిన్న వయస్సులోనే అలవర్చుకుని అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం సాధించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

## కల్లూరు బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

### హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచన



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 31 (ప్రజాకలం): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని లో-లెవెల్ బ్రిడ్జిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. బ్రిడ్జి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడి, గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా కల్లూరు వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా మిషన్ భగీరథ ప్రధాన పైపులు దెబ్బతినడంతో పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే, యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టి వీలైనంత త్వరగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు.

## ప్రజాకలం వార్తకు అధికారుల స్పందన

### మోటార్లతో నీటిని తొలగించిన అధికారులు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 31 (ప్రజాకలం)"వానొస్తే... సెలవే..! నీట మునిగిన బడి..!!" శీర్షికతో శుక్రవారం ప్రజాకలం దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు తక్షణమే స్పందించారు. వర్షాల కారణంగా పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉన్న నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో పాఠశాల ఆవరణలో నెలకొన్న సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించింది. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాకలం కథనాన్ని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తూ, వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వర్షపు నీరు నిల్వ కాకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరారు.


ప్రజా కలం
RNI NO.TELTEL/2010/33275
PRAJA KALAM Telugu Daily
31 Jul 2026 - Page 1

నీట మునిగిన బడి.. !!
వర్షం కురిసిందంటే చాలు...
విద్యార్థుల అవస్థలు..

వానొస్తే..సెలవే..!

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 30 (ప్రజా కలం) పాఠశాల ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోతూ చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు తరగతి గదులకు చేరుకోవడమే కష్టసాధ్యంగా మారుతోంది. ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటు.. మెట్ పల్లి పట్టణంలోని 11వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది.. ఏదో పొరపాటు వల్ల పరిసర ప్రాంతాల వర్షపు నీరంతా పాఠశాల ఆవరణలోకి చేరుతుండటంతో బడి మొత్తం జలమయమవుతోంది. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు బురద, మురుగు నీటిలో నడుచుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల బెడద, దుర్వాసనతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు పరిశీలించినప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతం కావడంతో విద్యార్థుల చదువుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వారు పేర్కొంటున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరకుండా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రజా కలం

# సమర్థనీయమేనా?

రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీచేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్–ఇన్–చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతి–వ్యతిరేకమని తప్పుపట్టారు. అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజా నిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని 'శాంతియుత, ప్రజాస్వామిక' అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన వాదనలను ఉటంకిస్తున్నారు. వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవించవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోదయోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని 'నైతిక ఆర్థిక వ్యవస్థ'ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి. అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా 'కలహశీల రాజకీయాల'ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి. భారత్‌లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లే ప్రజా నిరసనలు సంస్థాగత వైఫల్యాలకు అత్యవసర ప్రతిస్పందనలు కావని, భారత ప్రజాస్వామ్య తార్కికతలో అవి అంతర్భాగాలని దీపేశ్ చక్రవర్తి అన్నారు. సమస్యల పరిష్కారానికి రాజ్య వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు మూకుమ్మడి నిరసనలు అనేవి ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి, సందేహం లేదు. అసమానతల సమాజంలో ప్రజా నిరసనలు ప్రజాస్వామ్య పరిపుష్టికి తోడ్పడతాయని, అవి ప్రజాస్వామ్యానికి ప్రతికూలతలు కావని భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో ప్రజా ఉద్యమాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన పాట్రిక్ హెల్లర్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన యువజనుల నిరసన అసాధారణ నేపథ్యాన్ని మనం అంగీకరించాలి. వర్తమాన భారతదేశం సాధారణంగా పనిచేస్తున్న ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రతిస్పందనాత్మక స్వభావం కనిపించని కాలమిది. అవధులు లేని సంపూర్ణ అధికారాలకు పాలకులు ఆరాటపడుతున్నారు. తమ విధానాలపై ప్రజల అభిప్రాయాలను అలక్ష్యం చేస్తున్నారు. ప్రధాన స్రవంతి మీడియా ప్రభుత్వానికి పూర్తి విధేయత చూపుతోంది. పాలనపై విమర్శలకు ప్రాధాన్యమివ్వడం లేదు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థలూ అధికారపక్షం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. అవి అంతకంతకూ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతున్నాయి. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు స్వేచ్ఛ కొరవడుతోంది. ప్రతిపక్షాలను రూపు మాపేందుకు రాజ్యాధికారాలు దుర్వినియోగమవుతున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి కానీ, అవి ఇంకెంత మాత్రం ప్రజల సంకల్పానికి తార్కాణాలుగా లేవు. ఎన్నికల బరిలోకి దిగిన అన్ని పక్షాలకు సమానావకాశాలు లభించడం లేదు. న్యాయవ్యవస్థ రాజ్యాంగ నిబంధనలను అమలు పరచలేకపోతోంది. అధికారపక్షం ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ ప్రమాణాలను పాటించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో వీధులలో ప్రజలను సమీకరించి, నిరసన తెలపడమే ప్రజా ఆకాంక్షలను వ్యక్తం చేసేందుకు లభ్యమవుతున్న ఏకైక మార్గం. వీధి నిరసనలు న్యాయబద్ధమైనవి, ప్రజాస్వామ్యయుతమైనవి, సమర్థనీయమైనవి. జంతర్ మంతర్ వద్ద యువజనుల ధర్నా అందుకొక పరిపూర్ణ దృష్టాంతం. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు శాంతియుత నిరసన మార్గాన్ని ఎంచుకున్నందుకు ఆ యువజనులకు మనం కృతజ్ఞతలు చెప్పాలి. వారి నిరసన వ్యవస్థపై తిరుగుబాటు కాదు. ప్రజాస్వామిక రాజకీయాలలో విశ్వాసాన్ని అది పునరుజ్జీవింపజేసింది. ఆ యువ ఉద్యమకారులు ప్రజాస్వామ్యానికి హాని చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని వారు పునరుద్ధరించారు.

## ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ,భూగర్భ జలాల పెంపు,పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని,ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్,తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు.కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని,వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు.రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని,దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని,ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్,రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు ఇదే అరుదైన తరుణం

### ఎకరాకు రూ. 50 వేల సబ్సిడీ - జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆయిల్‌పామ్ మొక్కల నాటడానికి మరియు కొత్త తోటల స్థాపనకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు.వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. భూమిలో తేమ సమృద్ధిగా ఉన్న ఈ వాతావరణాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మొదటి మూడు సంవత్సరాల పాటు తోటలో కూరగాయలు,పప్పుధాన్యాలు వంటి స్వల్పకాలిక అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.నాలుగో సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్ గెలల కోత ప్రారంభమై రైతులకు ప్రతి నెలా నిరంతర ఆదాయం లభిస్తుందని వివరించారు.అలాగే డ్రిప్ ఇరిగేషన్,మల్చింగ్ పద్ధతుల ద్వారా నీటిని సమర్థవంతంగా పొదుపు చేసుకోవచ్చని తెలిపారు.ఆయిల్‌పామ్



సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలు,డ్రిప్ పరికరాలు,తోట నిర్వహణ నిమిత్తం అర్హులైన కొత్త రైతులకు ఎకరాకు రూ. 50 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని గడ్డం శ్యామ్ ప్రసాద్ కోరారు.

## భూముల రీ-సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి




### - అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలో చేపడుతున్న భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని,అన్ని మండలాల్లో సర్వే పనులను వేగవంతంగా,పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెగ్యులర్ సర్వేయర్లు,లైసెన్స్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో భూముల రీ–సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.సర్వే ప్రక్రియలో నిబంధనలు, పారదర్శకతను కచ్చితంగా పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని తెలిపారు.ప్రతి సర్వేయర్‌కు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని,రీ–సర్వే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.భూ రికార్డుల ఖచ్చితత్వం కోసం క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలన నిర్వహించాలని అన్నారు.భూముల రీ–సర్వే కార్యక్రమానికి సహకరించని లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించే లైసెన్సుడు సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని,అవసరమైతే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి రీ–సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.జిల్లాలో రీ–సర్వే పనుల పురోగతి,మండలాల వారీగా చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలు,వాటి పరిష్కారంపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,అదనపు సర్వేయర్ సోమేష్,రెగ్యులర్ సర్వేయర్లు,లైసెన్స్ సర్వేయర్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్లో ఉమేష్ ఘనంగా పదవీ విరమణ



హనుమకొండ జూలై 31 ప్రజా కలం ప్రతినిధి

మామునూర్ నాలుగవ బెటాలియన్ లో బెటాలియన్ నందు ఉమేష్ కుమార్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి హాజరు అయ్యి పదవీ విరమణ పొందుతున్న ఉమేష్ కుమార్ శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఉమేష్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ గా భర్తీ అయి అంచెలంచెలుగా ఎదిగి సీనియర్ అసిస్టెంట్,ఆఫీస్ సూపరిండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పదోన్నతులు పొందారు.మొదటి పోస్టింగ్ సిపిఒ కరీంనగర్,పిటిసి కరీంనగర్,సిపి కరీంనగర్,13వ బేటాలియాన్లో సుధీర్ఘ కాలం విధులు నిర్వర్తించి 4వ బేటాలియాన్లో తన సర్వీస్ లో ఎలాంటి రిమార్క్స్ లేకుండా పదవీ విరమణ పొశీదుతున్నారని తెలియజేసారు.ఉమేష్ కుమార్ సతీమణి సుధారాణి,వీరికి ఇద్దరు కుమార్తెలు సాయి నికిత, శ్రీ చందన. పదవీ విరమణ తర్వాత తమ కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కె.బాలయ్య, ఈ.వీరన్న రిజర్వు ఇన్స్పెక్టర్స్ విజయ్, కార్తీక్, రవి, సర్వర్,వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్,కృష్ణ అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థంభంపల్లి చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



వెల్గటూర్, జులై 31, ప్రజాకలం ప్రతినిధి :

జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని స్థంభంపల్లి గ్రామ పరిధిలో గల పెద్ద చెరువును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు అక్కడ గల చెరువు పూర్తిగా నిండి, కట్ట ప్రమాద స్థాయికి చేరుకుంది. కట్టకు ఏర్పాటు చేసిన తూము వద్ద గతంలో భారీగా గండిపడి" కట్ట" ప్రమాద స్థాయికి చేరుకోగా అధికారులు ఇసుక సంచులువేసి, గండిని మూసివేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కాగా ప్రస్తుతం వరద నీటితో కట్ట తెగిపోయో ప్రమాదంలో ఉందని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అక్కడికివెల్లి చెరువును పరిశీలించి అక్కడి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో కట్టకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు కోసం అవసమైన శాశ్వత చర్యలు చేపట్టాలని తెలిపారు.

కట్ట పై గల తుమ్మ చెట్లను తొలగించి, కట్ట కనిపించేలా చేయాలనీ ఆదేశించారు. ఈయన వెంట ఆర్డీఓ మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉదయ్ కుమార్, ఇరిగేషన్ డీఈ చక్ర నాయక్, ఏఈ ప్రవీన్, సర్పంచ్ భూపెల్లి రాజయ్య, ఉప సర్పంచ్ యాగండ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు..

## బండలింగాపూర్‌లో బోనాల పండుగ సీసీ రోడ్డు ప్రారంభించిన జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్, జూలై 31 (ప్రజా కలం);మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి ఇటీవల మంజూరై నిర్మాణం పూర్తయిన నూతన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సాదుల్లా కుటుంబానికి రూ.51 వేల ఆర్థిక సాయం



ఇబ్రహీంపట్నం జులై 31( ప్రజా కలంప్రతినిధి ) జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నంమండలం లోనిగోధూర్ గ్రామానికి చెందిన ఎం.డి. సాదుల్లా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పదో తరగతి సహపాఠులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ వంతుగా తలా కొంత మొత్తం విరాళంగా అందించి మొత్తం రూ.51,000 సేకరించారు.సేకరించిన మొత్తాన్ని సాదుల్లా కుమార్తె పేరుతో పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, గ్రామ సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆ డిపాజిట్‌కు సంబంధించిన చెక్కును సాదుల్లా కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సాదుల్లా కుటుంబానికి అండగా నిలిచిన సహపాఠుల సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి రాజేష్, ఉపసర్పంచ్ ఓంకారి లక్ష్మణ్, క్లాస్‌మేట్స్ సాత్పడి శ్రీనివాస్, శ్రీధర్, రమేష్, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

### -అదనపు కలెక్టర్ శ్రీరాములు

పెద్దపల్లి,జూలై 3:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రజల రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని,భూ రీ–సర్వేను ప్రశాంత వాతావరణంలో చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి.శ్రీరాములు అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సమీక్ష అనంతరం ఆయన శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా మీసేవా దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని,ఎస్ఐఆర్ ప్రక్రియకు కీలకమైన కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే జారీ చేయాలని సూచించారు.అలాగే ఎగువ ప్రాంతాల వరదల దృష్ట్యా దిగువ ప్రాంతాల ప్రజలను, నది పరివాహక ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లే వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.కాగా,మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాజెక్టులో 147.46 మీటర్ల నీటి మట్టం 18.6750 టీఎంసీలు ఉండగా, 88,705 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా..15 గేట్లు ఎత్తి 96,428 క్యూసెక్కుల అవుట్‌ఫ్లోను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, రెవెన్యూ మరియు ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.



## దాడి కేసులో దోషులకు మూడేళ్ల జైలుశిక్ష

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో 2019లో పాతకక్షల నేపథ్యంలో మేకల మల్లయ్య అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన మీనుగు మల్లేష్,మీనుగు చంద్రయ్యలకు నంది మేడారం జేఎఫ్‌సీఎం కోర్టు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10,200 చొప్పున జరిమానా విధిస్తూ గురువారం సంచలన తీర్పునిచ్చింది.ఈ ఘటనపై అప్పట్లో ధర్మారం ఎస్.ఐ కె.ప్రేమ్ కుమార్ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేయగా, న్యాయస్థానంలో ప్రభుత్వ తరఫున ఏపీపీ రాకేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు.సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టడంలో కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ సంతోష్ కీలక పాత్ర పోషించగా,నేరం రుజువు కావడంతో నిందితులకు ఈ శిక్ష ఖరారైంది.ఈ కేసులో బాధితుడికి న్యాయం జరిగేలా,నిందితులకు సకాలంలో శిక్ష పడేలా నిబద్ధతతో పనిచేసిన పోలీసు అధికారులను,సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ప్రత్యేకంగా అభినందించారు.

## గీత కార్మికుల చైతన్య యాత్రను జయప్రదం చేయండి.

### వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్,బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు



హనుమకొండ జులై 31 ప్రజా కలం ప్రతినిధి తెలంగాణ కల్లు గీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గీత కార్మికుల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. శుక్రవారం హనుమకొండ నయీమ్ నగర్ నందు గీతా కార్మికుల చైతన్య యాత్రకు సంబంధించి బస్సుయాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, గీతా కార్మిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, గీత కార్మికులకు సేవలు అందించిన నాయకులను స్మరించుకుంటూ అమరుల యాధిలో బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,ఈ బస్సు యాత్ర ఆగస్టు 2 నుండి ఆగస్టు 18 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత కార్మిక సంఘం నిర్వహిస్తుందని ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, బండి రంజిత్ కుమార్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోతి సాంబరాజు గౌడ్,కోలా ప్రతాప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబన్ని పరామర్శించిన మాజీ ఎంపీటీసీ మాడ్గుల రాజు

( వరంగల్/ పర్వతగిరి) జూలై 31, ప్రజాకలం ప్రతినిధి.
పర్వతగిరి మండలం దౌలత్ నగరం కు చెందిన పత్రిక విలేఖర్ గడ్డం కర్ణాకర్ గారి తండ్రీ గడ్డం సైదులు మృతి చెందగా శుక్రవారం వారి కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు పర్వతగిరి మాజీ ఎంపీటీసీ మాడ్గుల రాజు తుర్కల సోమారం, వడ్లకొండ సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, డెక్క సునీతకుమార్ డెక్క అశోక్ లు పరామర్శించి పార్థివదేహానికీ నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

### - బ్యాంక్ మేనేజర్ మధుమోహన్ రెడ్డి



ప్రజా కలం జూలై 31( గద్వాల ప్రతినిధి) రైతులు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించి తిరిగి పొందవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎల్కూరు శాఖ మేనేజర్ మధు మోహన్ రెడ్డి తెలిపారు. తమ బ్యాంకు పరిధిలో రైతులకు ఎప్పటికప్పుడు రుణాలు రెన్యువల్ చేయడం జరుగుతుందని, అలాగే కొత్త రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా 18.. 65 వయసు వారు సంవత్సరానికి 3 వేలు చెల్లిస్తే 60 లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. అలాగే పిఎం జేజే వై, పి ఎం ఎస్ బి వై పథకాలలో సంవత్సరానికి రూ.456 చెల్లిస్తే నాలుగు లక్షల బీమా ఉంటుందని తెలిపారు. రైతులు ఆర్థిక లావాదేవిల్లో ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది సాయి మహేష్, రాములు రైతులు, కస్టమర్లకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య

మల్హర్, జూలై 31 ప్రజాకలం ప్రతినిధి : మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల పిహెచ్ సి ని శుక్రవారం తాడిచర్ల ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాము కాటుకు గురై పిహెచ్ సి లో చికిత్స పొందుతున్న పెద్దతూండ్ల గ్రామానికి చెందిన తాళ్ల రాజిరెడ్డిని పరమార్శించారు. ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన విద్యార్థి కి అందించిన ప్రథమ చికిత్స పై వైద్యాధికారి డాక్టర్ వినయ్ భాస్కర్ ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, పాము,తేలు తదితర విష కీటకాలకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల వెంకటస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు




- హైపర్‌సైట్ తో సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం
- రేడియేషన్ థెరపీలో గేమ్ ఛేంజర్‌గా మారిన అడాప్టివ్ థెరపీ
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ తప్పనిసరి
- యశోద ఆసుపత్రి ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి

పెద్దపల్లి,జూలై 31:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) క్యాన్సర్ మహమ్మారిపై పోరులో వైద్య రంగం మరో మైలురాయిని దాటిందని,సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక సైట్ రేడియేషన్ థెరపీ అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాప్తికి కారణాలు,ఆధునిక చికిత్స విధానాలపై వివరాలను వెల్లడించారు.సమాజంలో క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని,దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవనశైలి అని ఆమె పేర్కొన్నారు.పొగాకు నమలడం,ధూమపానం,కారమైన ఆహారాలు,కలుషితమైన తిండి,వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల 70 నుంచి 80 శాతం క్యాన్సర్లు వస్తున్నాయని తెలిపారు.కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే జన్యుపరంగా కుటుంబంలో ఎవరికైనా ఉంటే వస్తాయని స్పష్టం చేశారు.క్యాన్సర్ చికిత్సలో సర్జరీ,కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ,ఇమ్యునోథెరపీ వంటి పద్ధతులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ స్రవంతి తెలిపారు.అయితే ట్రీట్మెంట్ సమయంలో వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వల్ల రోగులు మానసికంగా కుంగిపోకుండా,ఈ కొత్త అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను 50 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చునని వెల్లడించారు.ప్రతిరోజూ ట్రీట్మెంట్ సమయంలో గడ్డ సైజులో వచ్చే మార్పులను, చుట్టుపక్కల ఉండే ఆర్గాన్స్ కదలికలను ఈ మిషన్ స్పష్టంగా గుర్తిస్తుందని,దీనివల్ల ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిలకుండా నేరుగా కణితిపైనే కచ్చితమైన రేడియేషన్ ఇవ్వవచ్చని, ఊపిరితిత్తులు లేదా ఛాతి భాగంలో శ్వాస తీసుకోవడం వల్ల కదిలే కణితులను కూడా బ్రీదింగ్ సైకిల్ ట్రాకింగ్ ద్వారా కచ్చితంగా గుర్తించి చికిత్స అందించవచ్చని తెలిపారు.పాతకాలపు మిషన్లతో పోలిస్తే ఇందులో ట్రీట్మెంట్ సమయం చాలా తక్కువగా ఉంటుందన్నారు.రోగులు ఎక్కువసేపు శ్వాస బిగబట్టాల్సిన అవసరం లేకుండా తక్కువ సమయంలోనే చికిత్స పూర్తవుతుందన్నారు.రోజూ మారుతున్న శరీర పరిస్థితులను బట్టి చికిత్సను అడాప్ట్ చేసుకునే అద్భుతమైన అవకాశం ఈ హైపర్ సైట్ ద్వారా లభిస్తుందని ఆమె వివరించారు.

సికింద్రాబాద్ -యశోద హాస్పిటల్స్ తీసుకువచ్చిన ఈ హైపర్ సైట్ మిషన్ ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీలో ఒక విప్లవాత్మక మార్పు అని పేర్కొన్నారు.క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రాణాలను కాపాడుకోవాలని చేసుకోవాలని డాక్టర్ స్రవంతి తెలిపారు.ఈ సమావేశంలో పిఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

## మున్సిపల్ సమావేశాలకు జువ్వాడి నర్సింగ్‌రావును అధికారికంగా ఆహ్వానించాలి

### - వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్

మెట్ పల్లి(కోరుట్ల) ప్రతినిధి జులై 31 (ప్రజకలం)

తెలంగాణ రాష్ట్ర వెల్మ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై క్యాబినెట్ హోదా పొందిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావును గౌరవిస్తూ మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఇకపై జరిగే మున్సిపల్ సాధారణ సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయనను అధికారికంగా ఆహ్వానించాలని 3వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి బత్తుల నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన మెట్‌పల్లి మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎలాంటి అధికారిక పదవి లేకపోయినా గత రెండున్నర సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి కోసం జువ్వాడి నర్సింగ్‌రావు నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు అభివృద్ధి నిధులను తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ఆసుపత్రి చికిత్స ఖర్చుల్లో 60 నుంచి 70 శాతం వరకు సహాయం అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు సుమారు రూ.8 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయించి అనేక మంది పేద కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. ప్రస్తుతం మున్సిపల్ పరిపాలన



శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉండటం, జువ్వాడి నర్సింగ్‌రావుకు క్యాబినెట్ హోదా లభించడం మెట్‌పల్లి పట్టణాభివృద్ధికి మరింత ఉపయోగపడే అవకాశంగా మలుచుకోవాలని నరేష్ అభిప్రాయపడ్డారు. ఆయన సహకారంతో పట్టణానికి మరిన్ని అభివృద్ధి నిధులు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన ప్రోటోకాల్‌కు సంబంధించిన ఉత్తర్వులను సమావేశంలో చదివి వినిపించిన బత్తుల నరేష్, ప్రభుత్వ కార్యక్రమాలు, మున్సిపల్ సమావేశాల సమాచారాన్ని ముందస్తుగా జువ్వాడి నర్సింగ్‌రావుకు తెలియజేయాలని కోరారు. రాబోయే ప్రతి మున్సిపల్ సాధారణ సమావేశంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయనను అధికారికంగా ఆహ్వానిస్తూ భాగస్వామ్యం కల్పించాలని మున్సిపల్ పాలకవర్గం, అధికారులను విజ్ఞప్తి చేశారు.

## 40 ఏళ్ల పోలీస్ సేవకు ఘన వీడ్కోలు

### – ఆత్మీయ సన్మానంతో వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ

### సమాజ భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన పోలీస్ సేవ స్ఫూర్తిదాయకం

### ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలి: జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు



ప్రజాకలం జులై 31 ( గద్వాల ప్రతినిధి)

సమాజ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నాలుగు దశాబ్దాల పాటు పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఆర్ ఎస్సై టి. ఆంజనేయులుకు జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఆయనను పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు తమ కుటుంబ క్షేమం కంటే సమాజ క్షేమానికే ప్రాధాన్యతనిస్తూ నిరంతరం విధులు నిర్వర్తిస్తారని అన్నారు. దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ పోలీస్ సేవలో 7 సంవత్సరాలు జోగులాంబ గద్వాల్ జిల్లాలో విధులు నిర్వహించిన టి. ఆంజనేయులు, 2019లో ఏఆర్ ఎస్సై గా పదోన్నతి పొంది జిల్లాకు వచ్చారని తెలిపారు. సుదీర్ఘ సర్వీస్‌లో ఎలాంటి రిమార్కులు లేకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పోలీస్ ఉద్యోగం అంటే కేవలం ఒక వృత్తి కాదని, ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసే బాధ్యత అని ఎస్పీ అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ఇలాంటి పోలీస్ అధికారి రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. వారి సేవల వెనుక కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. నిత్యం యోగా లేదా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని, పిల్లలకు క్రమశిక్షణతో మార్గనిర్దేశం చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని కోరుతూ, ఉద్యోగ విరమణ పొందినప్పటికీ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న టి. ఆంజనేయులు పోలీస్ శాఖలో తనకు లభించిన సహకారాన్ని, సహచర అధికారులు మరియు సిబ్బంది అందించిన ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్, ఏఆర్ డీఎస్పీ శ్రీ నరేందర్ రావు, కార్యాలయ ఏఓ శ్రీ పి. సాయి కృష్ణ , కార్యాలయ సిబ్బంది, రిటైర్మెంట్ పొందుతున్న అధికారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పుట్టినరోజు వేడుక




వాజేడు జూలై 31 (ప్రజాకలం) మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం తెలంగాణ వాడబలిజ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వాడబలిజ సేవ సంఘం వాజేడు మండల కోశాధికారి సురేష్ మాట్లాడుతు రాష్ట్ర అధ్యక్షులు వాడబలిజ కులం అభ్యున్నతి కోసం ముందుండి నడిపిస్తు ఎన్నో కార్యక్రమాలకి,సభలకు హాజరువుతూ సహాయ సహకారాలను అందిస్తూ సేవలు చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర యుత్ అధ్యక్షులు బొల్లె ఆదినారాయణ వాజేడు మండల కోశాధికారి పానెం సురేష్,గౌరరాపు సర్వేశ్వరరావు,అల్లి నరేష్ గగ్గూరి సాయికుమార్, తునూరి రఘుబాబు బొల్లె నరసింహారావు రోడ్ద కుమార్ ముత్యబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు

## తలసేమియా,సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ అమలు హర్షణీయం



హనుమకొండ జులై 31 ప్రజా కలం ప్రతినిధి తలసేమియా,సికిల్ సెల్ బాధితుల సంక్షేమం కోసం 2018లో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ ఇంతకాలం అమలుకు నోచుకోని పెన్షన్‌ను, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించడం ఎంతో హర్షణీయమని ఐఆర్‌సీఎస్ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు అన్నారు.రాజ్యసభ సభ్యులు వేశీ నరేందర్ రెడ్డి,వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో,రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో తలసేమియా,సికిల్ సెల్ బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని,బాధితుల సమస్యలను గుర్తించి,వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఆగస్టు 15 నుంచి పెన్షన్ అమలు చేయాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతర వైద్య చికిత్సలు,రక్త మార్పిడి,మందులు మరియు ఇతర ఆరోగ్య అవసరాల కోసం అధిక ఖర్చులు భరిస్తున్న తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు,వారి కుటుంబాలకు ఈ పెన్షన్ ఎంతో ఆర్థిక భరోసా,చేయూతనిస్తుందని పేర్కొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం



నాగర్ కర్నూల్, జులై 31 (ప్రజా కలం) నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన ఏ. గోపాల్ , మహమ్మద్ పాషా పదవీ విరమణ పొందిన సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం వారి నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో చేసిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబంతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## చిన్నతనంలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు - మంత్రి కొండా సురేఖ

జూబ్లీహిల్స్ : పసివయసులోనే చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎంపీ కల్చరల్ సెంటర్ లో చెస్ చెక్ మెట్ లో వరల్డ్ రికార్డ్ సృష్టించిన ఏడేళ్ల చిన్నారి నైరాకు బహుమతిని అందజేసి, తల్లిదండ్రులు రిషిక, నరేష్ లను అభినందించారు. ప్రతి చిన్నారులు ప్రతిభ దాగి ఉంటుందని వాటిని గుర్తించి ప్రోత్సహించడమే తల్లిదండ్రుల పని అన్నారు. అగ్రరాజ్యం అమెరికాలో ఉంటున్న తమ కుమార్తె చదరంగం పట్ల ఆసక్తి చూపడంతో నగరానికి చెందిన రాయ్ అకాడమిలో ఆన్లైన్ శిక్షణ అనంతరం నగరానికి వచ్చి నేరుగా శిక్షణ ఇప్పించడంతో క్రీడలో అద్భుతంగా రాణిస్తుందని అన్నారు. 153 చెక్ మెట్లను అతి తక్కువ సమయంలో పూర్తి చేయడం గర్వంగా ఉందని అన్నారు.

## కారం రామన్న దొర ను పరామర్శించిన ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు

### – ఆశ్రమ పాఠశాలలో ఇద్దరేసి ఏఎన్ఎం పోస్టు భర్తీ చేయాలి

### – ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

దేవీపట్నం : వెన్నుపూస నొప్పితో మరియు జ్వరంతో బాధపడుతున్న ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర ను ఆర్ అండ్ ఆర్ కాలనీ పెద్ద భీం పల్లి – 2 పెనికిల పాడు గ్రామంలో ఉన్న ఇంటికి వెళ్లి పరామర్శించామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ...వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఏజెన్సీ మన్యం ప్రాంతంలో ప్రజలు అనారోగ్యానికి గురై మంచం పడుతున్నారన్నారు. మరోవైపు హాస్టల్స్ లో ఉన్న ఆదివాసీ విద్యార్థులు అనారోగ్యానికి గురై హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతున్నారు.ఈ మధ్యకాలంలో సరైన వైద్య అందక కొన్ని చోట్ల చనిపోతున్న సంఘటనలు ఉన్నాయన్నారు.కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆశ్రమ పాఠశాలలో ఇద్దరేసి ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని అలాగే మన్యం ప్రాంతంలోని ఏజెన్సీ అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన మెడికల్ క్యాంపులు నిర్వహించి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,కంగల గిరి,ఎ.శ్రీనివాసు,కె.రఘుపతి పాల్గొన్నారు.

## ఘనంగా నశా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి పోటీలు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 31: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు ఒ క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నశా ముక్త్ భారత్ అభియాన్ మరియు మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్నగర్ ఎన్టీఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణం లో జిల్లా స్థాయి నశా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో పలు సృజనాత్మక పోటీలను నిర్వహించారు. నుక్కడ్ నాటకం, పాటల పోటీలు, వ్యాసరచన, పోస్టర్ తయారీ తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు బహుమతులను అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రెబ్బ శ్రీనాథ్ గారు మోటివేషన్ స్పీకర్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఎన్సిసి కోఆర్డినేటర్ ఎం మధు శ్రీ మార్కండేయ శ్రీమతి కలమ్మ శ్రీ వసంత్ గారు డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ రాజేందర్ గౌడ్ గారు అనిల్ కుమార్ గౌడ్ గారు రాజేష్ గారు గారు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను విద్యార్థులకు వివరించి, మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా యువజన అధికారి శ్రీ వి. కోట నాయక్ గారు యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నుక్కడ్ నాటకం ద్వారా మత్తు వ్యసనాల వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజంపై కలిగే దుష్పరిణామాలను హృదయానికి హత్తుకునేలా ప్రదర్శించార.

## వెలుగుమట్ల ఇల్లు కూల్చివేత నిరసిస్తూ
# నేడు అంబేద్కర్ మనవడు ఖమ్మం రాక



ఖమ్మం జులై 31(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన ఆగస్టు 1న జరగబోవు నిరసన ర్యాలీ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీ ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకండి రాంబాబు మాట్లాడుతూ వెలుగుమట్ల పేద ప్రజల ఇల్లు కూల్చడం దుర్మార్గపు చర్య దాని ఖండిస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ విశారదన్ మహరాజ్ నేతృత్వంలో మహా ధర్నా అమర నిరాహార దీక్షల ఫలితంగా వెలుగుమట్లలోనే ప్రభుత్వం 311 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం మిగతా 500 మందికి ఆయా కారణాల చేత వారికి ఇవ్వకపోవడం వారికి ఇవ్వాలని జరిగిన సుదీర్ఘ పోరాట ఫలితంగా వారికి కూడా ఇస్తామని ముందుకు రావడం కానీ వెలుగుమటలు కాకుండా వేరే ప్రాంతంలో ఇవ్వటాన్ని నిరసిస్తూ వెలుగుమట్లలోనే వారికి కూడా ఇల్లు ఇవ్వాలని ఆగస్టు ఒకటి మధ్యాహ్నం 12 గంటలకు జడ్పీ సెంటర్ వరకు వెలుగుమట్ల బాధితులతో భారీ నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నాము అని అన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడు భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ , మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ , బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ మరియు ఎందరో ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు . కనుక ప్రజాతంత్ర అభ్యుదయ మానవతావాదులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు . బాధితురాలు సుమలత మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే వెలుగుమట్లలో ఇల్లు ప్రకటించకపోతే రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని ఆమె అన్నారు . ఈ కార్యక్రమంలో వెలుగుమట్ల బాధితులు వట్టే ఉదయ్ , ఎండీ అమిత్ , మట్ట నవ్య , మౌనిక , పోలూరి రాము , శివరాత్రి కృష్ణ , బుజ్జి నరసింహారావు , హసీనా , డి. రాము , వేముల కోటేశ్వరరావు , ఖదీర్ పాషా తదిరులు పాల్గొన్నారు .

# తెలంగాణలో మెరుగ్గా ఆయుష్ వైద్య సేవలు

### – లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రాససహాయం రఘురాంరెడ్డి ప్రశ్నకు వివరాలు వెల్లడించిన కేంద్రం

ఖమ్మం జులై 31(ప్రజా కలం న్యూస్)



తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు విస్తృతంగా అందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం లోక్‌సభలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రాససహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో జాతీయ ఆయుష్ మిషన్ ( ఎంఏఎం) కింద మంజూరైన అన్ని కేంద్రాలు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాయన్నారు.

**తెలంగాణలో ఆయుష్ కేంద్రాల స్థితిగతులు**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆయుష్ మిషన్ కింద మొత్తం 421 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏ ఏ ఎం) కేంద్రాలు మంజూరు కాగా.. పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాయన్నారు.

లితెలంగాణలోని ఆయుష్ కేంద్రాల్లో వైద్య సేవలు పొందిన రోగుల సంఖ్య కేంద్రం విడుదల చేసిన అధికారిక నివేదిక ప్రకారం ?2021లో 38,33,738 మంది రోగులు చికిత్స పొందారని తెలిపారు. ?2022లో 23,58,802మంది, 2023లో29,13,265 మంది,
2024లో 20,61,093 మంది, 2025లో18,58,894మంది
ఐదేళ్లలో మొత్తం 1,30,25,792 మంది తెలంగాణ ప్రజలు ఈ ఆయుష్ వైద్య కేంద్రాల ద్వారా సేవలు పొందారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు..అల్లోపతితో పాటు ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్) వైద్య విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా
# పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

### – ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన పోలీసు సిబ్బంది సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి : జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ జూలై 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటూ శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో, ప్రజలకు భరోసా కల్పించడంలో పోలీసు సిబ్బంది అందించిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ప్రభుత్వ విధులకు మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, తమ అనుభవాన్ని యువతకు, సమాజానికి పంచుతూ మార్గదర్శకులుగా కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన లిడీఎస్‌బీ నిర్మల్‌కు చెందిన ఎస్ఐ ఎం. నరసయ్య, నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎం. తారాచంద్ (1764), బాసర పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ వై. గంగాధర్ (480), లక్ష్మణచాందా పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎల్. శంకర్ (2388)లిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో లిలిఅడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) ఎం.డి. యూనుస్ అలీ, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఆర్ఐ రామ్‌నిరంజన్, ఆర్ఎస్ఐ రామకృష్ణతో పాటు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపిఓ సోమ్లాల్ కి ఘనంగా
# ఆత్మీయ వీడ్కోలు సమావేశం

### - మరిపెడ ఎంపీఓ నుండి కామేపల్లికి ఎంపీడీవోగా బదిలీ



మరిపెడ ప్రజాకలం న్యూస్ జూలై 31 : మహబూబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మరిపెడ మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించిన డి.సోమ్లాల్ పదోన్నతిపై ఎంపీడీవో గా ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కి బదిలీ ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీతో విశిష్ట సేవాలందించి గతంలో వరదలు వచ్చినప్పుడు అయితే నేమి స్థానిక సర్పంచుల ఎలక్షన్ల దగ్గర నుండి ప్రతి ఒక్కటి ప్రజలతో అలాగే కార్యదర్శులతో మమేకమై మచ్చ లేకుండా మంచి పేరు తెచ్చుకున్నటువంటి వ్యక్తి ఇటువంటి వ్యక్తి ఖమ్మం కామేపల్లి పీఎంఎం గా పదోన్నతి సాధించారు అక్కడ కూడా మంచిగా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు అదేవిధంగా ఎంపీఓ సోమలాల్ మాట్లాడుతూ భావోద్వేగంతో గ్రామపంచాయతీ సిబ్బంది దగ్గర నుండి కార్యదర్శులు వివిధ కోదాలలో ఉన్న అధికారులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు వివిధ రకాల సంఘాల వారు అందరితో తాను కలిసిపోయిన తీరుని వివరించారు అక్కడ ఉన్నటువంటి సిబ్బంది అధికారులు అందరూ ఘనంగా ఆత్మీయ వీడ్కోలు తెలిపారు సమావేశంలో పాల్గొన్న సిబ్బంది ఎంపీఓగా విధులు నిర్వహించినప్పుడు వారు చేసిన పనులు అలాగే కొన్ని కొన్ని సందర్భాలను జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని అందరితో పంచుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిరణ్, వైద్యాధికారి రవి, సూపరింటెండెంట్ యాకూబ్ మిషన్ భగీరథ ఏఈలు హాతిరం,అవినాష్ పిఆర్ ఏఈ అజయ్ మంగతాయారు, సీనియర్ అసిస్టెంట్,ఇమామ్ జూనియర్ అసిస్టెంట్ గోపి,సౌజన్య ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రావెాజీ, లెనిన్ వినోద్,ఉవేష్, అరుణ్,రాజు,లక్ష్మణ్, ఆపరేటర్లు ఉమా ఉమేష్ మునీర్ ప్రశాంత్, ఆయా గ్రామాల కారోబార్ లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా
# ముందస్తు చర్యలు చేపట్టాలి

### రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలి - రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



నిర్మల్ జూలై 31(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రాజెక్టుల పరిస్థితి, పంటల సాగు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో భారీ వర్షాల వలన ప్రాజెక్టుల నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో–ఔట్‌ఫ్లో పరిస్థితులు, దెబ్బతిన్న రహదారులు, వంతెనల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ, రహదారులు, వంతెనలు దెబ్బతిన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రాజెక్టులకు వస్తున్న ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి పంటకు బదులుగా ఆయిల్‌పామ్, కంది, నువ్వులు, పత్తి తదితర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. కొత్త పంటల సాగుకు అవసరమైన విత్తనాల సరఫరాకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొంటూ రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించాలని సూచించారు.

సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండాయని తెలిపారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు వేగంగా చేపడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా తాగునీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. రైతులు పంట మార్పిడి విధానాలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తోందని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, గతంలో జిల్లాలో 38 శాతం వర్షపాతం లోటు ఉండగా ప్రస్తుతం అది 6 శాతానికి తగ్గిందని తెలిపారు. జిల్లాలోని 21 మండలాల్లో 17 మండలాలు సాధారణ వర్షపాతం స్థితికి చేరుకున్నాయని పేర్కొన్నారు. గతంలో నీటి ఎద్దడి మండలాలుగా ఉన్న ఇంద్రవెల్లి, భోరజ్, సిరికొండ, బోథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాలు ప్రస్తుతం సాధారణ పరిస్థితికి చేరుకున్నాయని వివరించారు.ఈ ఏడాది జిల్లాలో 5,93,670 ఎకరాల్లో పంటల సాగు నమోదైందని, అందులో 4,37,698 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే కంది సాగు 44 వేల ఎకరాల నుంచి 56,751 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు వ్యవసాయంతో పాటు తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగపడనున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజేశ్వర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భైంసా మున్సిపల్ కార్మికులకు డ్రెస్సులు, గ్లౌజుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ జూలై 31 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భైంసా పట్టణ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కార్మికులకు కిట్ డ్రెస్సులు, గ్లౌజులను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ కార్మికుల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# జవులా(బి) గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



తానూర్,జులై 31(ప్రజా కలం): మండలం జవులా (బి) గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయాన్ని ఆసరాగా చేసుకుని, రైతు మహాదేవ్ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేశారు. అందులోని విలువైన కాపర్ వైర్లను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు, మోటార్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై ఉండటాన్ని గమనించి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పంట పొలాలకు నీరందించే సమయంలో ఇలా జరగడంతో రైతు ఆందోళన చెందుతున్నారు. బాధితుడు వెంటనే అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## గోతులమయంగా మారిన 'మొగ్లీ' రహదారి:

**రాకపోకలు బంద్, నరకం చూస్తున్న ప్రజలు!**

**వర్షాలకు మోకాళ్ల లోతు బురద.. పట్టించుకోని నాయకులు, అధికారులు**



తానూర్,జులై 31(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండల పరిధిలోని కోలూర్ నుండి మొగలి వరకు ఉన్న బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా తయారై ప్రయాణికులకు తీవ్ర నరకాన్ని చూపిస్తోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రహదారి మోకాళ్ల లోతు బురదగా మారి, ప్రయాణానికి వీల్లేకుండా తయారైంది,

**ప్రమాదకరంగా మారిన గుంతలు...** ఈ రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు పడటంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి, ప్రస్తుతం వర్షాల వల్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలకు, అత్యవసర వైద్య సేవలకు తీవ్ర విఘాతం కలుగుతోంది,

**అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం..** ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు,ఓట్ల కోసం వచ్చే నాయకులు, రోడ్డు దుస్థితిని చూసి పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు,ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి తమ రవాణా కష్టాలను తీర్చాలని తానూర్ మండల ప్రజలు కోరుతున్నారు

# పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం: తానూర్‌లో 'డ్రై డే - ఫ్రై డే'



తానూర్, జులై 31(ప్రజా కలం): సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియాలను అరికట్టడమే లక్ష్యంగా తానూర్ మండల కేంద్రంలో శుక్రవారం 'డ్రై డే - ఫ్రై డే' కార్యక్రమాన్ని అధికారులు విస్తృతంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పంచాయతీ, వైద్య–ఆరోగ్య శాఖల సిబ్బంది సంయుక్తంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు, ఇళ్లలోని కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూల కుండీలలో నిల్వ ఉన్న పాత నీటిని వెంటనే పారబోయాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వేగంగా వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు,వారంలో కనీసం ఒక్క రోజైనా ('డ్రై డే') ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షఫీ, ఆరోగ్య శాఖల సిబ్బంది,ఆశా కార్యకర్తలు,జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీళ్ళచెరువు గ్రామంలో ఘనంగా కలుశ ఊరేగింపు

పాలేరు జులై 31(ప్రజా కలం న్యూస్ )కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో స్థానిక భక్త భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ విశ్వ హిందు పరిషత్ సౌజన్యంతో శుక్రవారం అత్యంత వైభవంగా కలుశ ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇంటింట భక్తులు కలుశం కు జలాభిషేకం చేసి, పూజలు చేశారు. భక్తులు జై శ్రీరామ్ అంటూ వీదివీదిన తిరుగుతూ స్వామివారి కలుశంను భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా రామాలయంలో కలుశంకు ప్రధాన అర్చకులు ముడుంబా శ్రీమన్నారాయణ చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్త కమిటి బాధ్యులు చెన్నా వెంకన్న, అంబాల సైదులు, పెంద్ర అంజయ్య, చెన్నా విజయ్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, గోగుల అంజయ్య, కొండపల్లి రాములు, అంబాల సత్యనారాయణ, దొంతగాని వీరబాబు, బెజవాడ శ్రీకాంత్, మహిళా భక్తులు పాల్గొన్నారు



# జడ్చర్ల ఆకస్మిక తనిఖీలు

## మినీ గురుకుల పాఠశాల ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీలు - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 31

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జడ్చర్ల మండల పర్యటనలో భాగంగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్ల తో పాటు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన మినీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల జడ్చర్ల ను సందర్శించిన కలెక్టర్, పాఠశాల సిబ్బంది హాజరు రిజిస్టర్, తరగతి గదులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం నాలుగో తరగతి గదిలోకి వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. వారికి ప్రతిరోజు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, ఇతర సౌకర్యాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. పాఠశాలలో దోమల సమస్య తీవ్రంగా ఉందని, కొన్ని తరగతి గదుల కిటికీలకు తలుపులు కూడా లేవని అన్నారు. అలాగే కొన్ని తరగతి గదులలో ఫ్యాన్లు పనిచేయడం లేదని విద్యార్థులు కలెక్టర్ కు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, పనిచేయని ఫ్యాన్లను సాయంత్రంలోపు మరమ్మతు చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. కిటికీల తలుపుల మరమ్మతులు వెంటనే చేపట్టేందుకు అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ దెబ్బతిన్నందున దాని నిర్మాణానికి, కిటికీల మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలను అత్యవసరంగా సిద్ధం చేసి అనుమతుల కోసం సాయంత్రంలోపు ఫైల్ పంపించాలని సంబంధిత ఆర్‌సీఓను ఆదేశించారు. పాఠశాలలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో వెంటనే ఫాగింగ్ నిర్వహించి, దోమలను నిర్మూలించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్‌లిఅనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జడ్చర్ల మండల కేంద్రంలోనీ ఏరియా ఆసుపత్రిని సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రధాన కారిడార్, వార్డులు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి భవనం వెలుపల కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయినట్లు గుర్తించిన కలెక్టర్, వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజూ కనీసం మూడు పర్యాయాలు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

లేబర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో బాలింత మహిళలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, శానిటేషన్, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. అనంతరం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి పాత బజార్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ ఎం.గిరీష్, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మహమ్మద్ అర్షదుల్ల, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ

## – ప్రణాళిక అధికారి కె. రవీందర్‌ని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### – జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్‌కు ఘనంగా పదవీ విరమణ ఆత్మీయ కార్యక్రమం

### – సన్మానించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్,జె.ఎల్.బి.హరిప్రియ,జిల్లా అధికారులు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 31:

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) కె. రవీందర్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో 37 సంవత్సరాలు పూర్తి చేయడం చిన్న విషయం కాదని, జీవితంలో అత్యంత విలువైన కాలాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన ప్రతి ఉద్యోగిని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగి విజయవంతమైన సేవల వెనుక కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ, రవీందర్ కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా రవీందర్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కలెక్టర్ కొనియాడారు. అవసరమైన జిల్లా సమాచారాన్ని తక్కువ సమయంలో సమగ్రంగా సిద్ధం చేసి అందించడంలో ఆయన, ఆయన బృందం విశేష కృషి చేశారని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల సమాచారాన్ని సమన్వయం చేసి అందుబాటులో ఉంచడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కొంత విశ్రాంతి తీసుకుంటూ కుటుంబ సభ్యులతో సమయాన్ని గడపాలని, అదే సమయంలో శారీరకంగా, మానసికంగా చురుకుగా ఉండేలా ఏదో ఒక సృజనాత్మక కార్యకలాపంలో పాల్గొనాలని సూచించారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగానికి ఆమె అభినందనలు తెలిపారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, నిధుల వినియోగం, ఎమ్మెల్యే, ఎంపీ నిధులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమన్వయంలో కీలక పాత్ర



పోషిస్తుందని పేర్కొన్నారు. ఆ శాఖకు రవీందర్ సమర్థ నాయకత్వం వహించి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ, ప్రణాళిక శాఖకు రవీందర్ చేసిన విశేష సేవలను ఆమె కొనియాడారు. తన రిటైర్మెంట్ చేస్తే జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని అన్నారు. జిల్లా అధికారులు, ప్రణాళిక శాఖ అధికారులు, కుటుంబ సభ్యులు తదితరులు మాట్లాడుతూ రవీందర్ గారితో వాళ్లకున్న అనుబంధాన్ని, అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, కొత్తగా నియమితులైన ఫుల్ అడిషనల్ ఇంచార్జి సి. పి.ఓ నర్సింహులు, డి.పి. ఆర్.ఓ పి.శ్రీనివాస్, టి.జీ.ఓ అధ్యక్షులు విజయ్,ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లా సి. పి.ఓ లు, జిల్లా అధికారులు ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, దంపతులను ఘనంగా సన్మానించారు

# వెలుగుమట్లను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం

## 301 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగింపు : హౌజింగ్ పిడి శ్రీనివాస్

## రూ.10 కోట్లతో అన్ని మౌళిక వసతుల కల్పన -డిసెంబర్ 9 నాటికి కాలనీ ప్రారంభమే లక్ష్యం



ఖమ్మం, జూలై 31(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని వెలుగుమట్లను అన్ని వసతులతో కూడిన ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగుమట్లలో అర్హులైన 301 మంది నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలను మంజూరు చేయడంతో పాటు, 301 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. వెలుగుమట్ల లో గుడిసెలు వేసుకొని ఉన్న వారిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్వంత స్థలాలు కలిగిన 101 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసినట్లు, ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. వెలుగుమట్లలో గుడిసెలు వేసుకొని ఉన్నామని 8 వేల మంది దరఖాస్తులు చేసుకోగా, అట్టి దరఖాస్తుల సమగ్ర విచారణ చేపట్టి, అర్హులకు ఇండ్లు మంజూరుకు చర్యలు తీసుకోనున్నట్లు హౌజింగ్ పిడి అన్నారు. ఇళ్ల నిర్మాణం మరింత వేగంగా పూర్తయ్యేలా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) ద్వారా 124 మంది లబ్ధిదారులకు రూ.1 లక్ష చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతోందన్నారు. వెలుగుమట్ల కాలనీని ఆదర్శ కాలనిగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.10 కోట్ల వ్యయంతో మౌళిక సదుపాయాల పనులు చేపట్టిందన్నారు. కాలనీలో అంతర్గత సీసీ రహదారులు, విద్యుత్ కనెక్షన్లు, త్రాగునీటి సౌకర్యం, ప్రహరీ గోడ, పార్కు, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, అంగన్‌వాడీ కేంద్రం, వీధి దీపాలు, ప్రాథమిక పాఠశాల, తదితర అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు, మౌళిక వసతుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగు తున్నాయని, అన్ని పనులను పూర్తి చేసి 2026 డిసెంబర్ 9న వెలుగుమట్ల ఆదర్శ కాలనీని ప్రారంభించడమే ప్రభుత్వ లక్ష్యమని హౌజింగ్ పిడి శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆగస్టు 3 లోపు ప్రతి ఓటరు గణన ఫారాన్ని సమర్పించేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

### - గణన ఫారాలు సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం - జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### - బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులకు సహకరించాలి



ఖమ్మం, జూలై 31(ప్రజా కలం న్యూస్ )

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు గణన ఫారాన్ని ఆగస్టు 3 లోపు తప్పనిసరిగా సమర్పించేలా రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. 31,967 మంది మృతి చెందిన ఓటర్లు, 10,060 డబుల్ ఎంట్రీలు, 94 వేల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఇంకా సుమారు 31 వేల మంది ఓటర్లు గణన ప్రక్రియకు స్పందించడం లేదని, వీరిలో అధిక సంఖ్యలో ఖమ్మం నగరానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు.

గణన ఫారాలు పూరించి ఇవ్వని పక్షంలో సంబంధిత ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ పేరు ముసాయిదా జాబితాలో లేకపోతే అనంతరం అవసరమైన ధృవపత్రాలతో ఫారం-6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నమోదు అధికారులు రాజకీయ పార్టీలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారని, రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలు, మద్దతుదారులను చైతన్యపరచి గడువులోగా గణన ఫారాలు సమర్పించేలా చూడాలని కోరారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు ఆయా ప్రాంతాల్లో ఓటరుగా నమోదు అయ్యారా లేదా అనే విషయాన్ని కూడా రాజకీయ పార్టీలు తమ స్థాయిలో నిర్ధారించాలని సూచించారు. జిల్లాలో అందిన సుమారు 10 లక్షల గణన ఫారాల్లో 42 వేల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాలేదని, వారికి భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించేందుకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ధృవీకరణ పత్రం అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 1,460 పోలింగ్ కేంద్రాల్లో 677 కేంద్రాల్లో 100 శాతం గణన ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, మరో 544 కేంద్రాల్లో 95 శాతం, 158 కేంద్రాల్లో 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో కూడా 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వోలు) సహకరించి ప్రతి ఓటరు సరైన వివరాలతో గణన ఫారం సమర్పించేలా చూడాలని సూచించారు. ఆగస్టు 3 గణన ఫారాల సమర్పణకు చివరి తేదీ అని, ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి, అక్టోబర్ 12, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.

ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్వో సి. హెచ్. రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి డి. సౌజన్య, బీఆర్ఎస్ ప్రతినిధులు రమేష్, వేణుగోపాల్, వెంకటరావు, బీజేపీ ప్రతినిధి రాజేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి రామయ్య, ఆప్ ప్రతినిధి సుబ్బారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కేల్ మంజూరు చేయాలంటూ ఉపాధి హామీ ఉద్యోగుల పెన్‌డౌన్ షట్‌డౌన్ నిరసన

### కూసుమంచిలో ప్రభుత్వానికి హెచ్చరిక సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం

పాలేరు జులై 31(ప్రజా కలం న్యూస్ )

ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న వీబీ-జీ రామ్-జీ ఉద్యోగులకు పే స్కేల్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగ సంఘం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు కూసుమంచి మండలంలోని ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో, గ్రామీణాభివృద్ధి పనుల్లో, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఇప్పటికీ తమకు తగిన పే స్కేల్ లేకపోవడంతో ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం




వెంటనే వీబీ-జీ రామ్-జీ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పే స్కేల్ మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఈసీ కరుణ, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, హరి నాయక్, భవాని, శ్రీనివాస్, రవికాంత్, తులసి తదితర ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్దల నర్సయ్య-సైదమ్మ దంపతులకు ఘన సన్మానం

### – మరిపెడ ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య ఉద్యోగ విరమణ

మరిపెడ ప్రజాకలం న్యూస్ జూలై 31

మహబూబాద్ జిల్లా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన గద్దల నర్సయ్య నేడు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవి మరియు హాస్పిటల్ సిబ్బంది నాగయ్య సైదమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. నర్సయ్య సేవా నిరతిని కొనియాడుతూ ఈ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను (మెమెంటో) బహుకరించారు.

గద్దల నర్సయ్య 2003లో మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా కాంట్రాక్టు ఉద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.

నాటి నుండి నిరంతరాయంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, 2023లో రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగిగా నియామకం పొందారు. నాటి నుండి నేటి వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ఈ రోజు విజయవంతంగా రిటైర్మెంట్ అయ్యారు. నర్సయ్య సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో ఆయనకు వెన్నుదన్నుగా నిలిచిన సతీమణి సైదమ్మ ని కూడా సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘన వీడ్కోలు కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, సూపర్‌వైజర్ ఆచార్యులు, లక్ష్మి కుమారి, మాధవి, పల్లె దవాఖానా సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిక- కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఒక ఆప్తమిత్రుడిని, ఉద్యమ సహచరుడిని కోల్పోవడం వ్యక్తిగతంగా తనకు, పార్టీకి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలోనూ, వరంగల్ జిల్లా ఉద్యమంలోనూ సుదర్శన్ రెడ్డి తనతో కలిసి నడిచిన తీరును కేసీఆర్ స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ పక్షాన చేసిన విశ్వప్రయత్నాలు, వైద్యులు అందించిన చికిత్స విఫలం కావడంపై మనోవేదన చెందారు.తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీలతో ప్రజా జీవితంలో కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమైనదని కొనియాడారు. పోరాటాల ఖిల్లా నర్సంపేట గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో పోరాడిన ధీరుడని ప్రశంసించారు.

చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే నడుస్తూ, అటు ఉద్యమంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధిలోనూ తనకంటూ ఒక చెరగని ముద్ర వేసుకున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. పోలీసు ఒత్తిళ్లు, కేసులు, జైలు నిర్బంధాలకు లొంగని ఆయన ఉద్యమ పటిమ, ధైర్యసాహసాలు కార్యకర్తల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని తెలిపారు. సుదర్శన్ రెడ్డిని కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమయంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ సూచించారు.



# కరకపట్లలో పోలీసుల కార్డన్ సెర్చ్

## - 32 బైకులు సీజ్.. బెల్ట్ షాపులపై కొరడా
## -నేర నియంత్రణకు భారీ ఆపరేషన్.



గజ్వేల్ నియోజకవర్గం: 31 జూలై ప్రజా కలం ప్రతినిధి )

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మార్కుక్ మండలం కరకపట్ల గ్రామంలో శుక్రవారం గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో భారీ పోలీసు బలగాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో గజ్వేల్ ఏసీపీతో పాటు ఇద్దరు సీఐలు,10 మంది ఎస్ఐలు, 111 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.మొత్తం సిబ్బందిని తొమ్మిది ప్రత్యేక బృందాలుగా విభజించి గ్రామంలోని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను,బెల్ట్ షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 29 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహులు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు లేదా పూర్తి వివరాలు,గుర్తింపు కార్డులు లేని వారికి ఇళ్లను అద్దెకు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని,గ్రామంలో ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి వీధి, కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు,తొగుట సీఐ లతీఫ్, మార్కుక్ ఎస్ఐ యూనిస్‌తో పాటు గజ్వేల్ డివిజన్‌కు చెందిన ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నాగు ముదిరాజ్ కు కీలక బాధ్యత

గజ్వేల్:31 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల నాగు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర నాయకులు రామచంద్రరావు, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లన్నగారి భిక్షపతి, నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్‌తో పాటు పార్టీ కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. మామిండ్ల నాగు ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతూ,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సిద్దిపేట జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.



# మహేశ్వరం మండల స్థాయి సమావేశంలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై చర్చ

## సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తాం అధికారుల హామీ

మహేశ్వరం, జూలై 31 (ప్రజా కలం )

మహేశ్వరం మండలంలోని గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్ ఎన్. శుభాషిణి




అధ్యక్షత వహించారు. మండలంలోని గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ల దుస్థితి, తాగునీటి సమస్యలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ, రెవెన్యూ సమస్యలు, మొక్కల పెంపకం, విద్యా వ్యవస్థ, మద్యపాన నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న పనులు, ప్రగతి, పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎన్. శారదమ్మ, డీఎల్‌పీఓ సామీ రెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ సభావత్ కృష్ణ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు

## - ట్రేడ్ యూనియన్ లోగో ఆవిష్కరణ..
## - టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీ పార్టీ-కల్వకుంట్ల కవిత
## - దేశంలో హక్కులను కాలరాసే కుట్ర...
## - కార్మికుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు..
## - ప్రైవేట్ శక్తులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు ..
## - కార్మికులు,ఉద్యోగులు,టీచర్ల హక్కుల కోసం పోరు..




హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్మికుల ఫ్రెండ్లీ పార్టీగా ఉంటుందని తెలంగాణ రక్షణ సేనా అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేనా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రేడ్ యూనియన్ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...టీఆర్ఎస్ అధికారంలోకి వస్తాని ధీమా వ్యక్తం చేశారు. తమది కార్మికుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. టీఆర్టీయూను కార్మిక లోకానికి అంకితం చేస్తున్నట్లు వెల్లడించిన అమె లోగో లో ఒక వైపు పెన్ను, మరో వైపు పాణా ఉందని వివరించారు. అన్ని రంగాల అండగా ఉంటామని వివరించారు. ఇక దేశంలో లేబర్ చట్టాలు, కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాస్తున్నారని ఆరోపిం చారు. కార్మికుల హక్కులు కాపాడాలంటే ట్రేడ్ యూనియన్, లేబర్ యూనియన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్మికులు,యువశక్తి లేకుండా దేశం ముందుకు వెళ్లడం కష్టమన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలకు సంతోషంగా పనిచేసే అవకాశం కల్పించాలని కవిత పేర్కొన్నారు. కానీ ప్రభుత్వమే ఎక్కువ శ్రమ దోపిడీ చేస్తుందని మండిపడ్డారు. అవుట్ సోర్స్,కాంట్రాక్ట్ కార్మికులు,ప్రభుత్వ ఉద్యోగులు ధర్నాలు చేసే పరిస్థితి తలెత్తడం అందుకు నిదర్శనమన్నారు. ఈ అంశాన్ని ప్రస్తావించి నిలదీస్తే బెదిరించటం, కేసులు పెట్టుతున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఇలా ఉంటాయా? అని ప్రశ్నించారు. ప్రైవేట్ దోపిడీకి ప్రభుత్వమే మార్గాన్ని చూపిస్తోందని ఎద్దేవ చేశారు.

**ట్రేడ్ యూనియన్ రక్షణ కవచం,రాజ్యాంగ బద్దం,కార్మికుల హక్కు**

ట్రేడ్ యూనియన్ చట్టాలు కార్మికులకు రక్షణగా నిలిచాయని కవిత తెలిపారు. 1926 నుండి ఈ చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వివరించారు. దేశంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత, మోడీ ప్రభుత్వం లేబర్ చట్టాలను తుంగలో తొక్కి నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాల కారణంగా కార్మికుల హక్కులను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆయా చట్టాలను అమలు చేయమని బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో ఈ చట్టాలను అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు స్పష్టమైన భరోసా ఇవ్వాలన్నారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి పని చేసిన సమయంలో షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం 20 వేలు ఉండాలని నాటి సీఎం కేసీఆర్ కు లేఖ రాసిట్లు గుర్తు చేశారు. ఆయన సీఎంగా పదవీబాధ్యలు చేపట్టిన తర్వాత ఆ అంశాన్ని మరిచారని మండిపడ్డారు. ఇప్పటికి వారికి రూ.16 వేలు చెల్లిస్తున్నారని వివరించారు. వారికి 26 వేల కనీసం వేతనం చెల్లించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోందన్నారు.

**ఐటీ,ఫార్మాలో యూనియన్లు....**

ఐటీ, ఫార్మా రంగాల్లో యూనియన్ల అవసరం ఉందని కవిత గుర్తు చేశారు. ప్రభుత్వాల కన్నాఐటీ రంగం గొప్పది కాదని,ఐటీ లో పనిచేసే వాళ్ల ఉద్యోగం ఎప్పుడు పోతుందనే భయం ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీలో ఐటీ సెక్టార్ కోసం వింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల జీనోమ్ వ్యాలీలో రెండు వందల మంది తెలుగు మాట్లాడే వాళ్లను తీసేశారు. ఏలాంటి యూనియన్లు లేకపోవడంతో వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు సంతోషంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అందుకు తగిన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఆటోడ్రైవర్లను టెర్రరిస్టులు చూస్తోం దని, పోలీసులు చలాన్ వేస్తున్నారని స్పష్టం చేశారు. రోజంతా కష్టపడి సంపా దించిన డబ్బు చలాన్లకే సరిపోతుందన్నారు. ప్రభుత్వాలు పేదలు, కార్మికులు, ఉద్యోగుల వైపే ఉండాలి కవిత సూచించారు.

# చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్...

## రిమాండ్‌కు తరలింపు.

## దౌల్తాబాద్ ఎస్ ఐ అరుణ్ కుమార్.

దుబ్బాక ప్రజాకలం జూలై 31.

దౌల్తాబాద్‌లో బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ జి.అరుణ్ కుమార్ తెలిపారు. దౌల్తాబాద్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్‌లోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోని కల్లు కాంపౌండ్ వద్ద పార్క్ చేసి ఉన్న మోటార్‌సైకిల్‌ను కొండాపూర్ గ్రామానికి చెందిన వరదం యాదగిరి చోరీ చేశాడు. అనంతరం ఆ బైక్‌ను అమ్మేందుకు తీసుకెళ్తున్న సమయంలో దౌల్తాబాద్ పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి.అరుణ్ కుమార్ ప్రజలకు పలు సూచనలు చేశారు. వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా లాక్‌తో పాటు ఇతర భద్రతా పరికరాలు ఉపయోగించాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## 15వ వార్డు సమస్యపై బిజెపి వినతి పత్రం

గజ్వేల్:31 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులోని తూప్రాన్ రోడ్డు, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో ప్రతి ఏడాది వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ 15వ వార్డు బీజేపీ నాయకుడు జోడు ప్రకాష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు,మున్సిపల్ చైర్మన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ ధ్యేయమని,వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నందున అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్,సీనియర్ నాయకులు వెంకటేష్,గడియారం రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.



# కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో సర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించిన డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్

మహేశ్వరం, జూలై 31,(ప్రజా కలం)

కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ అన్నారు. డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ – సర్ కార్యక్రమంలో భాగంగా ఏ ఎస్ ఆర్ గార్డెన్స్‌లో బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన అధ్యక్షత డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ ముఖ్య అతిథులు డివిజన్ సర్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి కెఎల్ఆర్ పి.ఏ. రవీందర్ పాల్గొన్నారు. డివిజన్‌కు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ పెద్ద సంఖ్యలో సమావేశంలో సర్ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి బి ఎల్ ఏ తమ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పనిని బాధ్యతాయుతంగా, ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూడాలని, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. డాక్టర్స్ కాలనీ డివిజన్ ఏ ఎస్ ఆర్ గార్డెన్స్‌లో సర్ కార్యక్రమంపై బి ఎల్ ఏ సమావేశం. డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ గారి ఆధ్వర్యంలో, సర్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి రవీందర్ సమక్షంలో జరిగింది.



# తోగుట పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన గజ్వేల్ ఏసీపీ కె.నర్సింలు.

దుబ్బాక ప్రజాకలం జూలై 31.

గజ్వేల్ ఏసీపీ కె. నర్సింలు శుక్రవారం వార్షిక తనిఖీ నిమిత్తం తోగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసు ప్రాపర్టీ, స్టేషన్ ఆవరణలో ఉన్న కేసులకు సంబంధించిన వాహనాలను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, సీసీటీఎన్ఎస్ తదితర విభాగాల పనితీరును సమీక్షించి, సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాలు మరియు ఇతర కేసుల దర్యాప్తును నిష్పాక్షికంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోగుట సిఐ లతీఫ్, ఎస్ఐ నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

యాదాద్రి భువనగిరి జిల్లా, జులై 31 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్, శుక్రవారం రోజున ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు శాఖలో సుదీర్ఘకాలం




అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ పదవీ విరమణ పొందిన సిబ్బంది పోలీసు శాఖకు అందించిన విలువైన సేవలను అభినందించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో వారు నిర్వర్తించిన బాధ్యతలను ప్రశంసించారు. పదవీ విరమణ పొందిన సిబ్బంది: 1.ఎం.డి.కాజా లతీఫ్,ఏఎస్ఐ --తుర్కపల్లి పోలీస్ స్టేషన్ ,2.ఎం.డి.నుస్రత్ అలీ, ఏఎస్ఐ --మహిళా పోలీస్ స్టేషన్,భువనగిరి,3 కె. శ్రీనివాసులు, ఏఎస్ఐ -- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,చౌటుప్పల్ పోలీసు శాఖలో ఎన్నో సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించినందుకు గాను వారి సేవలను గుర్తిస్తూ ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ అనంతరం వారు మరియు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా,ప్రశాంతమైన మరియు సంతృప్తికరమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖకు, ప్రజలకు వారు అందించిన సేవలకు గుర్తుగా ఈ సత్కార కార్యక్రమం నిర్వహించబడింది.

## గీతం క్యాంపస్‌లో ఉద్యోగాల వర్షం

### -గీతం విద్యార్థులకు వెయ్యికి పైగా ఉద్యోగాలు..

పటాన్‌చేరు, జులై 31 (ప్రజా కలం) ప్రతినిధి

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అచీవర్స్ డే--2026ను ఘనంగా నిర్వహించి, 2026 బ్యాచ్ ప్రాంగణ నియామకాల ఫలితాలను ప్రకటించింది. 1,347 మంది విద్యార్థుల్లో 771 మంది ఉద్యోగాలు




సాధించగా, 324 ప్రముఖ సంస్థలు వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాయి..వ్యాపార నిర్వహణ విద్యా విభాగం 97.5 శాతం ఉద్యోగాలతో అగ్రస్థానంలో నిలవగా, నిర్మాణ శిల్ప విద్యా విభాగం వంద శాతం ఉద్యోగాలు నమోదు చేసింది. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి అత్యధికంగా 544 ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ ఏడాది గరిష్ఠంగా రూ.16 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ నమోదైంది.

జీ.టి. కృష్ణ చైతన్య, రిచర్డ్ కింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జి. సృజన్, డి. వీణాశ్రీ, ఇ.జె. సంఘమిత్ర, నిహారిక నోముల, పమిశెట్టి ప్రేమ్ కుమార్ తమ అనుభవాలను పంచుకోగా, ఎన్.వి. శ్రీనివాస్ స్వరూప్ విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ వడ్డి, ప్రొఫెసర్ జి. శివకుమార్, డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, డాక్టర్ మోతహర్ రెజా, డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా, డాక్టర్ శామ్యూల్ ధరు, డాక్టర్ ఎడ్విన్ ఆంథోనీ, డాక్టర్ కె. మమతతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు..

## నకిలీ నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు

### - హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి

### -గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

గజ్వేల్:31 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ ఎస్ ఆర్ పి) మాత్రమే చట్టబద్ధమైనవని, నకిలీ, మార్పులు చేసిన,స్టిక్కర్ ఆధారిత, డూప్లికేట్ లేదా అస్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను వాహనాలపై అమర్చడం చట్టవిరుద్ధమని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గజ్వేల్ పట్టణంలో




గజ్వేల్ ట్రాఫిక్ సత్యనారాయణ మాట్లాడుతూ. ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించడం ద్వారా వాహనాల అసలు గుర్తింపును దాచడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిం చడం,నేర కార్యకలాపాలకు సహకరించే అవకాశం ఉన్నందున ఇటువంటి ఉల్లంఘనలను సిద్ధిపేట పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ లేదా అనధికారిక నెంబర్ ప్లేట్లతో సంచరించే వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకుని అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని వాహన యజమానులు తమ వాహనాలకు ప్రభుత్వం ఆమోదించిన హెచ్ ఎస్ ఆర్ పి నంబర్ ప్లేట్లు మాత్రమే అమర్చుకున్నట్లు వెంటనే ధృవీకరించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ నిబంధనలను పాటిస్తూ,ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో... అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

### - వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి.

### - లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి. -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 31( ప్రజా కలం ): రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మత్స్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



జిల్లాలో నమోదైన వర్షపాతం, రానున్న రోజుల వర్ష సూచనలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు.

జిల్లాలోని అన్ని లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాత భవనాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా పూర్తి వివరాలను అన్ని శాఖలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువల నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు.

క్షేత్రస్థాయిలో వరదలు లేదా ఇతర నష్టాలు సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు, పశుసంపద, పంటలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రత్యేక మండల అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

త్రాగునీటికి ప్రాధాన్యతనివ్వాలని,జిల్లాలో ప్రజలకు ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటల సాగు చేయకుండా, భూగర్భ జలాల లభ్యత, ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ, వరదనీటి పారుదల, అత్యవసర సేవలకు సంబంధించి ముందస్తు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, రాత్రికి రాత్రే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి మండలంలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ప్రమాదకర చెరువులు, కాలువలు, కాజ్‌వేలు, ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి మెడికల్ కళాశాల ముందు మెడికల్ యూనియన్ ధర్నా.

### -కాలేజీ సూపరింటెండెంట్ కు వినతి పత్రం అందజేశారు.

### -అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చెయ్యాలి

### -కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవాలి

### -కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీలో పనిగా మారింది

### -మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్



సంగారెడ్డి ప్రతినిధి
జులై 31( ప్రజా కలం):

అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చెయ్యాలి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠినమైన చర్య తీసుకోవాలి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మడమే ఏజెన్సీల పనిగా మారిందని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి అన్నారు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం సూపర్డెంట్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూలి ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు రావాలంటేనే ఏజెన్సీలు,అధికారులకు చేతులు తడిస్తే తప్ప ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు అందులో పని చేస్తున్న కార్మికులను కాదని అధికారులు ఏజెన్సీలకు వత్తాస్తు పలుకుతూ వాళ్లకి అనుకూలంగా ఉన్నవారికి డబ్బులు ఇస్తేనే ఉద్యోగం ఇస్తున్నారని ఆయన అన్నారు మార్పు అంటే ఇదేనేమో అని అన్నారు ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరుమీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు అధికారులు ఎవరికి చెప్పకుండా కాంట్రాక్టర్లకు వత్తాస్తు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని రాతొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వ హాస్పిటల్,మెడికల్ కళాశాల అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఆయన అన్న లేనిపక్షంలో భవిష్యత్తులో ఏమన్నా జరుగుతే దీనికి బాధ్యత ప్రభుత్వ హాస్పిటల్, మెడికల్ కళాశాల అధికారులు వహించాల్సి వస్తుందని అన్నారు .

ప్రభుత్వం స్పందించి వెంటనే నియామ కాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం మరింత తీవ్రతం చేస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కే,యాదగిరి కే, సదానంద నాగరాజు, సునీత లక్ష్మీ ప్రియ మొగులమ్మ భాగ్యలక్ష్మి శేఖర్ నాగరాజు, మహేందర్ రెడ్డి సురేష్ మల్లేశం మహేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేంజ్ ఆఫీసర్ వినాయక్ ను సన్మానించిన డాక్టర్ కుమారస్వామి




గజ్వేల్:31 జూలై 2026
( ప్రజా కలం ప్రతినిధి )

అంతర్జాతీయ రేంజర్స్ డే సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు డాక్టర్ లయన్ కుమారస్వామి ఆధ్వర్యంలో గజ్వేల్ రేంజ్ ఆఫీసర్ వినాయక్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ,అడవుల సంరక్షణ,వన్యప్రాణుల రక్షణ కోసం గజ్వేల్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో అటవీ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రేంజ్ ఆఫీసర్ వినాయక్ మాట్లాడుతూ,లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ పవన్ కుమార్, శ్రీహరి, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు జిల్లెలగూడకు కాంగ్రెస్ నేత జి.చిన్నారెడ్డి

### బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ

### ఆగస్టు 3తో ముగియనున్న ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ

### మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్

మహేశ్వరం, జూలై 31, (ప్రజా కలం )

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం జిల్లెలగూడ డివిజన్ లో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి పర్యటించనున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిధులను మంజూరు చేస్తుందని కె ఎల్ ఆర్ అన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ప్రభుత్వం అందిస్తున్న



చెక్కులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైఎస్ ఛైర్మన్ జి. చిన్నారెడ్డి రానున్నారు. ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారి సర్కార్... బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తుందన్నారు.

ఆగస్టు 3తో సర్ ముగింపు: కిచ్చెన్న

ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ– సర్ కార్యక్రమం ముగుస్తున్నందున్న ఎన్యూమరేషన్ ఫారమ్స్ నింపిన వారు వెంటనే బి ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. ప్రతీ బూత్ స్థాయిలో కాంగ్రెస్ బి ఎల్ ఏ లు సైతం ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారని కె ఎల్ ఆర్ చెప్పారు.

ప్రతీ బి ఎల్ ఏ 5 నుంచి 10 మంది పేర్లు ఇవ్వండి లక్ష్మారెడ్డి 542 బూత్ ల్లో నిర్విరామంగా పని చేస్తున్న కాంగ్రెస్ బి ఎల్ ఏ లు ప్రతీ ఇంటినీ, ఓటర్, ఎన్యూమరేషన్ ఫారమ్స్ పంపిణీ, ఆన్ లైన్ ఎన్ రోల్ మెంట్, చనిపోయిన వారి వివరాలు, ట్రాన్స్ ఫర్ అయిన ఓటర్ల మ్యాపింగ్ ను ఎప్పటికప్పుడూ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు.

## ఏడుపాయల తల్లికి ఘనంగా కళ్యాణం

### -ఏడుపాయల దుర్గమ్మ

### కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..

పటాన్‌చెరు, జులై 31 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవం,బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, దర్శన్, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు..



# మూడేళ్లలో ఎయుఎంను 1.5 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయనున్న అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్; ప్రపంచవ్యాప్త విస్తరణ ప్రణాళిక ప్రకటింపు

**- గిఫ్ట్ సిటీలోని ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ మూడు దిశల్లో వృద్ధి ప్రణాళికను ప్రకటించింది**

**- ఉత్పత్తుల విస్తరణ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరణ, కొత్త పెట్టుబడిదారుల వర్గాలపై దృష్టి**

గాంధీనగర్/ముంబై, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

గిఫ్ట్ సిటీలో ప్రధాన కార్యాలయం కలిగిన ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్ఎల్‌పీ, గిఫ్ట్ సిటీలో తన కార్యకలాపాలను ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, రాబోయే మూడు సంవత్సరాల్లో తమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 750 మిలియన్ డాలర్ల నుంచి 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నేడు ప్రకటించింది.

ఆస్తి వర్గాల్లో భిన్నమైన, అధిక విలువ సృష్టించే పెట్టుబడి అవకాశాలను అందించడంపై దృష్టి సారించిన ఈ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ, తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరించడం, అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని మరింత బలోపేతం చేయడం, అలాగే కొత్త భౌగోళిక ప్రాంతాలు మరియు కొత్త పెట్టుబడిదారుల వర్గాలను లక్ష్యంగా చేసుకోవడం అనే మూడు ప్రధాన అంశాలపై ఆధారిత విస్తరణ వ్యూహాన్ని ప్రకటించింది.

ఇన్ఫోగ్రాఫిక్

ముఖ్యాంశాలు

ఎయుఎం లక్ష్యం: రాబోయే మూడు సంవత్సరాల్లో నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 750 మిలియన్ డాలర్ల నుంచి 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచే ప్రణాళిక.

ఉత్పత్తుల విస్తరణ: డాలర్–నామినేటెడ్ రుణ ఆధారిత రెండు ఉత్పత్తులతో పాటు, కమోడిటీ/విలువైన లోహాల ఆర్బిట్రాజ్ ఫండ్, గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించనున్న ప్రణాళిక.

అంతర్జాతీయ విస్తరణ: మధ్యప్రాచ్య దేశాలతో పాటు మారిషస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాల్లో అదనపు కార్యాలయాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది.

భారతీయ పెట్టుబడిదారులకు విస్తృత ప్రాప్యత: ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, బ్యాంకుల ద్వారా భారతీయ పెట్టుబడిదారులకు తమ గ్లోబల్ పెట్టుబడి ఉత్పత్తులను మరింత అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. అలాగే ఈ ఏడాదిలోనే ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతాల్లో కొత్త పెట్టుబడిదారుల సంబంధాలు, పంపిణీ కార్యాలయాలను ప్రారంభించనుంది.

గిఫ్ట్ సిటీ విస్తరణ: అదనంగా 3,300 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఏర్పాటు చేసి, 100 మంది వరకు పనిచేసే సామర్థ్యాన్ని కల్పించనుంది. గిఫ్ట్ సిటీపై దీర్ఘకాలిక నిబద్ధత: గిఫ్ట్ సిటీలో నిర్మాణంలో ఉన్న శిల్ప్ ట్విన్ టవర్లో 12,000 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.

ఉత్పత్తుల పనితీరు: సంస్థ ప్రారంభించిన తొలి ఫండ్, ప్రారంభమైన తొలి మూడేళ్లలోనే పెట్టుబడిదారులకు ఆరు రెట్లు (6x) రాబడిని అందించింది.

**గిఫ్ట్ సిటీలో అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వృద్ధి ప్రస్థానం**

గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలను ప్రారంభించిన రెండేళ్లలోనే అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఒకే ఫండ్‌తో ప్రారంభమైన వేదిక నుంచి ఆరు ఫండ్లను నిర్వహించే సంస్థగా ఎదిగింది. అదే సమయంలో, తన బృందాన్ని గణనీయంగా విస్తరించడంతో పాటు కార్యాలయ మౌలిక సదుపాయాలను కూడా మరింత బలోపేతం




చేసింది.

అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్ఎల్‌పీ మేనేజింగ్ పార్ట్నర్ సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, "మా రెండో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భంగా, ఇంకా బాల్యదశలోనే ఉన్న మా ఔత్సాహిక వ్యాపార ప్రయాణం విశేషంగా అభివృద్ధి చెందింది. ఒకే ఒక్క ఫండ్‌తో ప్రారంభమైన మా సంస్థ నేడు ఆరు ఫండ్ల స్థాయికి చేరుకుంది. ఇద్దరు సభ్యులతో స్వయం సమీకృత (బూట్‌స్ట్రాప్డ్) స్టార్టప్‌గా ప్రారంభమైన మా బృందం ఇప్పుడు దానికి పది రెట్లు విస్తరించింది. అలాగే, కో–వర్కింగ్ స్పేస్‌లోని నాలుగు సీట్ల యూనిట్ నుంచి ప్రస్తుతం 2,345 చదరపు అడుగుల విస్తీర్ణంలో 60 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన కార్యాలయానికి ఎదిగాం" అని తెలిపారు.

ఈ కాలంలో, అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ భారతదేశంలోని ఏకైక ఆఫ్‌షోర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ అయిన గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అతిపెద్ద ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటిగా అవతరించింది. అంతేకాకుండా, థర్డ్–పార్టీ ఫండ్ మేనేజ్‌మెంట్ సేవలను అందించేందుకు లైసెన్స్ పొందిన తొలి సంస్థగా, అలాగే భౌతిక కమోడిటీ ఆధారిత గోల్డ్ ఫండ్‌ను ప్రారంభించిన తొలి ఫండ్ హౌస్‌గా కూడా గుర్తింపు పొందింది.

భవిష్యత్ వృద్ధికి మద్దతుగా గిఫ్ట్ సిటీలో విస్తరణ

తదుపరి దశ వృద్ధి వ్యూహంలో భాగంగా, అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ గిఫ్ట్ సిటీలోని తన కార్యాలయ విస్తీర్ణాన్ని మరింత పెంచుతోంది. సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, "రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ సమయంలో, మరింత వేగవంతమైన వృద్ధికి మేము సిద్ధమవుతున్నాం. వ్యాపార విస్తరణ ప్రణాళికలకు మద్దతుగా, ప్రస్తుతం గిఫ్ట్ సిటీలో ఉన్న 2,400 చదరపు అడుగుల కంటే తక్కువ కార్యాలయ స్థలానికి అదనంగా 3,300 చదరపు అడుగుల స్థలాన్ని జోడిస్తూ, మా కార్యాలయ విస్తీర్ణాన్ని రెండింతలకు పైగా పెంచుతున్నాం. ఈ విస్తరించిన మౌలిక సదుపాయాలు రాబోయే మూడు సంవత్సరాల్లో 100 మంది వరకు పనిచేసే సామర్థ్యంతో మా అవసరాలను సమర్థంగా తీర్చగలవు" అని తెలిపారు. ఈ కొత్త కార్యాలయ స్థలం గిఫ్ట్ సిటీలోని ప్రీమియం గ్రేడ్–ఏ వాణిజ్య భవనం ఫ్లెక్స్‌వన్ ఐదో అంతస్తులో ఏర్పాటు చేయబడుతోంది.

సచిన్ సావ్రికర్ ఇంకా మాట్లాడుతూ, "గిఫ్ట్ సిటీ పట్ల మా నిబద్ధత దీర్ఘకాలికమైనది. ఈ ప్రాంతంలో గిఫ్ట్ సిటీని అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రంగా తీర్చిదిద్దడంలో మా వంతు పాత్రను పోషించాలని మేము భావిస్తున్నాం. అందుకే, ప్రస్తుతం ప్రారంభిస్తున్న విస్తరించిన కార్యాలయం కంటే రెండింతలకు పైగా విస్తీర్ణం కలిగిన 12,000 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని గిఫ్ట్ సిటీలో నిర్మాణంలో ఉన్న శిల్ప్ ట్విన్ టవర్లో కొనుగోలు చేసేందుకు కూడా మేము ఒప్పందం కుదుర్చుకున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 28 అంతస్తుల గ్రేడ్–ఏ వాణిజ్య భవనం అయిన ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.

అర్థ భారత్ ఉత్పత్తుల శ్రేణిని రెండింతలు చేయనున్న కొత్త ఫండ్‌లు

రాబోయే రెండేళ్లలో అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను గణనీయంగా విస్తరించాలని యోచిస్తోంది. సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, "ప్రస్తుతం మా వద్ద ఉన్న ఆరు ఫండ్‌లు ఇప్పటికే విశేషమైన పనితీరును కనబరిచాయి. ముఖ్యంగా, మా తొలి ఫండ్ తన కార్యకాలంలోని తొలి మూడేళ్లలోనే పెట్టుబడిదారులకు ఆరు రెట్లు (6x) రాబడిని అందించింది. ఇప్పుడు, క్రమం తప్పకుండా ఆదాయం పొందాలనుకునే అలాగే స్వల్పకాలిక అదనపు నిధులను పెట్టుబడిగా ఉంచాలనుకునే ఇన్వెస్టర్ల కోసం డాలర్–నామినేటెడ్ రుణ ఆధారిత మరో రెండు ఉత్పత్తులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అదనంగా, కమోడిటీ/విలువైన లోహాల ఆర్బిట్రాజ్ ఫండ్ మరియు గ్లోబల్ ఈక్విటీ ఫండ్‌ను కూడా ప్రారంభించనున్నాం" అని తెలిపారు. ఈ ఫండ్ హౌస్ ప్రస్తుతం సొంతంగా అభివృద్ధి చేసిన పరిమాణాత్మక పెట్టుబడి వ్యూహాన్ని కూడా రూపొందిస్తోంది. ఈ నమూనాను ఆధారంగా చేసుకుని పెట్టుబడి పథకాన్ని ప్రారంభించే ముందు, దానిపై బ్యాక్–టెస్టింగ్ నిర్వహించి, అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సంస్థ యోచిస్తోంది. రాబోయే రెండేళ్లలో ప్రారంభించనున్న ఈ కొత్త ఫండ్‌లతో, అర్థ భారత్ ప్రస్తుతం అందిస్తున్న ఉత్పత్తుల శ్రేణి దాదాపు రెట్టింపు కానుందని సంస్థ వెల్లడించింది.

**అంతర్జాతీయ విస్తరణకు అర్థ భారత్ ప్రణాళికలు**

అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగా, అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఇప్పటికే ఒమాన్, దుబాయ్‌లలో ఉన్న తన కార్యకలాపాలను ఆధారంగా చేసుకుని మధ్యప్రాచ్యంలో తన ఉనికిని మరింత విస్తరించాలని యోచిస్తోంది. అదేవిధంగా, మారిషస్ మరియు సింగపూర్ వంటి ఇతర అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రాల్లో కూడా కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలను ఈ ఫండ్ హౌస్ పరిశీలిస్తోంది.

ఈ విస్తరణ ద్వారా అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ అంతర్జాతీయ పెట్టుబడి మూలధనాన్ని మరింత విస్తృత స్థాయిలో ఆకర్షించడంతో పాటు, ప్రపంచస్థాయి ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ వేదికగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

భారతీయ పెట్టుబడిదారులు, కొత్త పెట్టుబడిదారుల వర్గాలపై ఫండ్ హౌస్ దృష్టి

అర్థ భారత్ వృద్ధి వ్యూహంలోని మూడో ప్రధాన స్తంభం, కొత్త భౌగోళిక ప్రాంతాలు మరియు కొత్త పెట్టుబడిదారుల వర్గాలను లక్ష్యంగా చేసుకుని తన పెట్టుబడిదారుల స్థావరాన్ని విస్తరించడంపై కేంద్రీకృతమై ఉంది. సచిన్ సావ్రికర్ మాట్లాడుతూ, "ఇప్పటివరకు మా అన్ని ఫండ్‌లు భారతదేశం వెలుపల ఉన్న పెట్టుబడిదారుల నుంచి నిధులను సమీకరించడంపైనే దృష్టి సారించాయి. ఇకపై మా ఫండ్‌లను దేశీయ పెట్టుబడిదారులకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆల్ఫా సృష్టిపై దృష్టి సారించిన మా ప్రత్యేక పెట్టుబడి ఉత్పత్తుల ద్వారా, వివిధ ఆస్తి వర్గాల్లోని గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని భారతీయ పెట్టుబడిదారులకు కల్పించాలనుకుంటున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, మా పెట్టుబడి పథకాలను తమ దేశీయ ఖాతాదారులకు అందించేందుకు పలువురు ఫండ్ డిస్ట్రిబ్యూటర్లు, బ్యాంకులతో ప్రస్తుతం చర్చలు జరుపుతున్నాం" అని తెలిపారు. ఈ విస్తరణ కార్యక్రమానికి మరింత బలం చేకూర్చేందుకు, అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా వంటి ప్రధాన మహానగరాల్లో పెట్టుబడిదారుల సంబంధాలు మరియు పంపిణీ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. దీంతో, మధ్యప్రాచ్యం, మారిషస్, సింగపూర్‌లలో ఇప్పటికే ఉన్న తన అంతర్జాతీయ ఉనికితో పాటు, భారతదేశంలోని ప్రధాన ఆర్థిక, సంపద నిర్వహణ కేంద్రాల్లో కూడా అర్థ భారత్‌కు ప్రత్యక్ష కార్యాచరణ ఉనికి ఏర్పడుతుంది.

భారతదేశంలో వేగంగా పెరుగుతున్న అధిక నికర విలువ మరియు అత్యంత అధిక నికర విలువ కలిగిన పెట్టుబడిదారుల సంఖ్య, ప్రత్యేకమైన గ్లోబల్ పెట్టుబడి పరిష్కారాలను అందించే ఫండ్ మేనేజర్లకు గణనీయమైన అవకాశాలను సృష్టిస్తోంది. హురున్ గ్లోబల్ జాబితా ప్రకారం, 300 మందికి పైగా బిలియనీర్లతో, అమెరికా, చైనా తర్వాత అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశంగా భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది. దీని ఫలితంగా దేశంలో వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. సంపన్న పెట్టుబడిదారుల సంపదను సంరక్షించడంతో పాటు మరింత పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు అందించే వెల్త్ మేనేజర్ల నెట్‌వర్క్ కూడా నిరంతరం విస్తరిస్తోంది.

ప్రణాళికలో ఉన్న కొత్త ఫండ్‌ల ప్రారంభం, అంతర్జాతీయ విస్తరణ, అలాగే వేగంగా పెరుగుతున్న భారతీయ సంపన్న పెట్టుబడిదారులు మరియు ఫ్యామిలీ ఆఫీసెస్‌ను లక్ష్యంగా చేసుకున్న వ్యూహం ద్వారా, ప్రత్యేకమైన గ్లోబల్ పెట్టుబడి అవకాశాలపై పెరుగుతున్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహంతో, రాబోయే మూడు సంవత్సరాల్లో తన నిర్వహణలోని మొత్తం ఆస్తుల (ఎయుఎం) విలువను 1.5 బిలియన్ డాలర్లకు రెండింతలు పెంచాలని సంస్థ భావిస్తోంది.

# బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఎఫ్.ఓ.ఎఫ్. కు ఏడాది పూర్తి

**- తొలి ఏడాదిలోనే పెట్టుబడిదారులకు రెండంకెల రాబడి**

ముంబై, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మ్యూచువల్ ఫండ్ నేడు తన బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఫీఓఫీ) ప్రారంభమై ఏడాది పూర్తయినట్లు ప్రకటించింది. 2025 జూన్ 30న ప్రారంభమైన ఈ ఫండ్, ప్రారంభం నుంచి 10.31 శాతం రాబడిని అందించడంతో పాటు, తన బెంచ్‌మార్క్ పనితీరును అధిగమించి ఒక కీలక మైలురాయిని చేరుకుందని సంస్థ వెల్లడించింది.

ఈ పథకం ఒక సంవత్సర కాలంలో 10.67 శాతం రాబడిని అందించగా, దాని కాంపోజిట్ బెంచ్‌మార్క్ అదే కాలంలో 10.38 శాతం రాబడిని నమోదు చేసింది. దీంతో, ఈ ఫండ్ ప్రారంభమైన సమయంలో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారుడి పెట్టుబడి విలువ, కేవలం ఏడాదికి కొద్దిగా మించిన వ్యవధిలోనే సుమారు రూ.1.11 లక్షలకు పెరిగింది.

ఈక్విటీ, డెట్, బంగారంలో పన్ను ప్రయోజనాలతో కూడిన సమగ్ర, విభిన్నీకృత పెట్టుబడి పరిష్కారం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఒకే పెట్టుబడి ద్వారా పలు ఆస్తి వర్గాల్లో విభిన్నీకృత పెట్టుబడి అవకాశాలను కోరుకునే ఇన్వెస్టర్ల కోసం రూపొందించబడింది. ఈ పథకం ఈక్విటీ, డెట్, బంగారం వంటి వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు పెడుతుంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులు, అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలకు అనుగుణంగా ఈ ఆస్తుల కేటాయింపులను ఫండ్ మేనేజ్‌మెంట్ బృందం చురుకుగా నిర్వహిస్తుంది.

ఈ ఆస్తుల కేటాయింపు వ్యూహం, మూలధన విలువ పెరుగుదల మరియు పోర్ట్‌ఫోలియో స్థిరత్వం మధ్య సమతుల్యతను సాధించడంతో పాటు, వివిధ మార్కెట్ చక్రాల్లోనూ పెట్టుబడిదారులు అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా రూపొందించబడింది. ఈ ఫండ్, లిలిఈక్విటీ ఆధారిత మల్టీ అసెట్ ఎఫ్.ఓ.ఎఫ్.లతో పోలిస్తే తక్కువ అస్థిరతతో, రిస్క్‌కు అనుగుణంగా స్థిరమైన రాబడులను అందించేలా రూపొందించబడింది.

24 నెలల కంటే ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులు 12.50% చొప్పున దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుతో పాటు అదనపు ప్రభుత్వ ఛార్జీలను (ఈక్విటీ–ఆధారిత ఫండ్‌ల మాదిరిగా) పొందవచ్చు.

ఈ పథకం, మూడు ఆస్తి వర్గాలకు చెందిన మ్యూచువల్ ఫండ్ పథకాల పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, దీర్ఘకాలిక మూలధన వృద్ధితో పాటు ఆదాయాన్ని సృష్టించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

వాస్తవిక మల్టీ అసెట్ పోర్ట్‌ఫోలియోను ప్రతిబింబించేలా రూపొందించిన బెంచ్‌మార్క్

ఈ పథకం పనితీరును కింది అంశాలతో కూడిన సమ్మిళిత బెంచ్‌మార్క్‌తో పోల్చి అంచనా వేస్తారు:

60% -- నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్

20% -- నిఫ్టీ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్

20% -- భారతీయ రూపాయల్లో బంగారం ధర

ఈ బెంచ్‌మార్క్, ఫండ్ అనుసరిస్తున్న విభిన్నీకృత, చురుకైన పెట్టుబడి నిర్వహణ విధానానికి ప్రతిరూపంగా ఉంటుంది.

తక్కువ కనీస పెట్టుబడితో అందరికీ అందుబాటులో పెట్టుబడి అవకాశం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, విభిన్నీకృత పెట్టుబడిని విస్తృత శ్రేణి ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది.

ఇన్వెస్టర్లు కింది కనీస మొత్తంతో పెట్టుబడిని ప్రారంభించవచ్చు:

కనీస ఒకేసారి పెట్టుబడి: రూ.1,000

అదనపు పెట్టుబడులు: రూ.1 నుంచి, ఆ తర్వాత రూ.1 గుణిజాల్లో

నెలవారీ ఎస్ఐపీ: రూ.500 నుంచి ప్రారంభం, ఆ తర్వాత రూ.1 గుణిజాల్లో పెట్టుబడి పెట్టవచ్చు.

ఈ పథకంలో ప్రవేశ రుసుము లేదు. అయితే, మధ్యకాలిక పెట్టుబడులను ప్రోత్సహించే ఉద్దేశంతో, పెట్టుబడి చేసిన తేదీ నుంచి ఒక సంవత్సరం పూర్తికాకముందే యూనిట్లను రిడీమ్ చేసినా లేదా మరో పథకానికి మార్చుకున్నా, 1% ఎగ్జిట్ లోడ్ విధించబడుతుంది.

దీర్ఘకాలిక సంపద సృష్టికి నిపుణుల నిర్వహణలో సమగ్ర పెట్టుబడి పరిష్కారం

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఈక్విటీ, డెట్, బంగారం వంటి ఆస్తి వర్గాల్లో ఒకే పెట్టుబడి పరిష్కారం ద్వారా చురుకుగా నిర్వహించే పెట్టుబడులను అందిస్తూ, పోర్ట్‌ఫోలియో విభిన్నీకరణను సులభతరం చేయడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన ఆస్తుల కేటాయింపు ద్వారా ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక సంపదను సృష్టించుకునేలా సహాయపడటాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను తరచుగా స్వయంగా సమతుల్యం చేయాల్సిన అవసరం లేకుండానే, పలు ఆస్తి వర్గాల్లో నిపుణుల ఆధ్వర్యంలోని ఫండ్ నిర్వహణ ప్రయోజనాన్ని పొందవచ్చు. అందువల్ల, విభిన్నీకృత, దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైన పెట్టుబడి పరిష్కారంగా నిలుస్తుంది.

# ఫెర్నాండెజ్ ఫౌండేషన్, జీవీకే హెల్త్‌తో భాగస్వామ్య ఒప్పందం

**- జూబ్లీ హిల్స్ వేదికగా జీవీకే హెల్త్‌లో కొత్త ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్ ప్రారంభం..**

**- 77 ఏళ్ల విశ్వసనీయ మహిళా ఆరోగ్య సంరక్షణతో సేవలు..**

**- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాలపరిమిత మహిళా ఆరోగ్య ప్యాకేజీతో ఔట్‌పేషెంట్ క్లినిక్ సేవలు..**

**-మహిళలు నివారణ సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా ప్రోత్సహిస్తూ ప్రత్యేక ప్యాకేజీ..**

హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

మహిళలు, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణలో భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన సంస్థలలో ఒకటైన ఫెర్నాండెజ్ ఫౌండేషన్ (FF), జూబ్లీ హిల్స్‌లోని జీవీకే హెల్త్‌లో ప్రత్యేక ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్‌ను ప్రారంభించేందుకు జీవీకే హెల్త్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ప్రసూతి, గైనకాలజీలో ఫెర్నాండెజ్ ఫౌండేషన్ యొక్క 77 ఏళ్ల వైద్య నైపుణ్యాన్ని హైదరాబాద్‌లోని అత్యంత చైతన్యవంతమైన ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో ఒకటైన జూబ్లీ హిల్స్‌కు తీసుకువస్తుంది. తద్వారా నగరవ్యాప్తంగా మహిళలు వారి కుటుంబాలకు నిపుణులైన మహిళా ఆరోగ్య సంరక్షణ మరింత అందుబాటులోకి, సౌకర్యవంతంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జీవీకే హెల్త్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమన్ రాజు జె, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ వీరా ఈ కొత్త ఔట్‌పేషెంట్ క్లినిక్‌లో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు.

ఈ క్లినిక్ గర్భధారణ సంరక్షణ, సంతాన సాఫల్య మూల్యాంకనం, నివారణ గైనకాలజీ, కౌమార – రుతుక్రమ ఆరోగ్య సంరక్షణతో పాటు సంక్లిష్టమైన గైనకాలజీ సమస్యల నిర్వహణతో సహా సమగ్ర ప్రసూతి, గైనకాలజీ సేవలను అందిస్తుంది.

స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్..

జీవీకే హెల్త్‌లో ఫెర్నాండెజ్ ఔట్‌పేషెంట్ క్లినిక్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ 1 నుండి 15 ఆగస్టు 2026 వరకు పరిమిత కాల (తాత్కాలిక) స్వాతంత్ర్య దినోత్సవ మహిళా ఆరోగ్య ప్యాకేజీని అందిస్తోంది. ఇందులో భాగంగా రూ.1,947 ధర గల ఈ ప్యాకేజీలో గైనకాలజీ కన్సల్టేషన్, ఋూఎ, పెల్విక్ అల్ట్రాసౌండ్, జదీజ, పాప్ స్మియర్, HbA1c ఉన్నాయి. ఇది మహిళల నివారణ ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే ముఖ్యమైన స్క్రీనింగ్ పరీక్షలను ఒకచోట చేర్చుతుంది. ఈ ప్యాకేజీ కింద గైనకాలజీ కన్సల్టేషన్లు జీవీకే హెల్త్, జూబ్లీ హిల్స్‌లో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య అందుబాటులో ఉంటాయి. ముందుగా బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి.. మరియు ఉచిత కన్సల్టేషన్ ప్యాకేజీలో భాగంగా మాత్రమే లభిస్తుంది.





# జాతీయ రహదారిపై లారీల భీకర దాడి

## ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు, తప్పిన ప్రాణనష్టం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 31:

కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 63 (చీస 63) పై గురువారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక గండి హనుమాన్ దేవాలయం సమీపంలో వేగంగా ప్రయాణిస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద తీవ్రతకు రెండు లారీల ముందు భాగాలు పూర్తిగా నలిగిపోయాయి. అయితే, ఈ భారీ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రక్తగాయాలైన డ్రైవర్లు - స్పందించిన పోలీసులు:లారీలు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో, వాటిని నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోయారు. వారికి శరీరాలపై తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే కమ్మర్‌పల్లి ఎస్సై సిహెచ్. సతీష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి, తీవ్రంగా గాయపడిన డ్రైవర్లను వాహనాల నుంచి సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం వారిని అత్యవసర వైద్యం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పునరుద్ధరించబడిన ట్రాఫిక్:ప్రమాదం జరిగిన సమయంలో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎస్సై సతీష్ పర్యవేక్షణలో పోలీసులు క్రేన్ల సహాయంతో దెబ్బతిన్న లారీలను రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు. అనంతరం వాహనాల రద్దీని క్రమబద్ధీకరించి, రాకపోకలను పునరుద్ధరించారు. ప్రస్తుతం రహదారిపై ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుందని పోలీసులు తెలిపారు.

# ముంబైలో "ప్రేమ్ ఉత్సవ్" జాతీయ నాటకోత్సవం షురూ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 31:

22భాషలు, ఒక ప్రేమ్‌చంద్, ఒక భారత్ అనే సందేశంతో మున్షీ ప్రేమ్‌చంద్ కథలకు ఘన నివాళి తెల్పడానికి ఇండియన్ డ్రామా ఎంటర్టైమెంట్ అకాడమీ (ఐడియా) ఆధ్వర్యంలో "ప్రేమ్ ఉత్సవ్- 2026" అనే జాతీయ



నాటకోత్సవం ఘనంగా ప్రారంభమైనాయి. ఇవి 2రోజుల పాటు చర్చిగేట్ సిడ్నహాం కాలేజీ హాల్లో కొనసాగనున్నాయి. హిందీ సాహిత్య వేత్త, విప్లవ, హేతువాద రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ కథల ఆధారంగా ఈ ఉత్సవాలు. దీని ప్రత్యేకతలు "భాషలు వేరైనా, భావాలు ఒక్కటే" అనే సందేశాన్ని మున్షీ కాలాతీత కథల ద్వారా జరుపుకోవడమే. భారత రాజ్యాంగం గుర్తించిన 22భాషల ద్వారా 22కథలు మున్షీ రాసిన 22కాలాతీత కథల ఆధారంగా నాటకాల ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిని ముజీబ్ ఖాన్ రూపొందించి, డిజైన్ చేసి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ డ్రామాలకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన విషయం విధితమే. శుక్రవారం ఉత్సవ ప్రారంభం రోజున తెలుగు నాటిక "కుసుమ్" కళాకారులైన ప్రఖ్యాత కవి రచయిత డాక్టర్ అంబాల జనార్ధన్, కార్మిక నేత రమేష్ చౌవల్, పింకీ సిసిల్య, లక్ష్మీపతి తదితరలను ఎంటిబిఎఫ్ టీం వారు రంగస్థలం సాక్షిగా ఘనంగా ప్రోత్సాహిస్తూ అభినందనలు తెల్పారు. ఇందులో నారపాక లక్ష్మణ్, శ్రీరాం కాషయ్య, నాగరాజ్ కొమ్ములు, సరిత చౌవల్, లక్ష్మిప్రియ, లక్ష్మణ్ బర్లకుంట, స్నేహ, ఉన్నారు.

## ముంబై క్రైస్తవ పాస్టర్ కు అంబేడ్కర్ తైలచిత్రం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 31:

పాస్టర్ తుమ్మల చంద్రశేఖర్ ముంబై వాస్తవ్యులు. ముంబై తెలంగాణ రాష్ట్రాలకు క్రైస్తవ దైవజనులుగా పేరు గాంచిన వ్యక్తి. వీరి గ్రామం తాళ్ళారాంపూర్, మండలం ఎర్గట్ల, జిల్లా నిజామాబాద్. వీరు ముంబైలో పుట్టి పెరిగి, ఉన్నత విద్యను అభ్యసించి, ఎం.టి.ఎన్.ఎల్ లో విధులు నిర్వహించిన మహారాష్ట్ర ప్రభుత్వపు ఉద్యోగి. వీరు ఇటీవల మహానగరంలో పదవీ విరమణ పొందారు. వీరి గ్రామం అనాడు



తోలి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకున్న జిల్లాలో అగ్రభాగాన ఉన్న ఊరుగా చరిత్రలో నిల్చింది. ఐతే శుక్రవారం మధ్యాహ్నం ఆర్మూర్ లో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం (ఏవైఎస్) చేత ఆయనకు సతీమణి చంద్ర కి "భీంరావు చిత్రపటం" ఏవైఎస్ అధ్యక్షులు దొన్కంటి లింగం మాలజీ, డి.సుజాత లు బహుకరిస్తూ సన్మానించారు. ఆయన విరమణ అనంతరం దైవ సేవతోపాటు భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, సమస్త బహుజన ప్రజలతో మమేకం కావాలని లింగం ఈ సందర్భంగా వారిని కోరారు.

# అనుమతులు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి



అనంతపురం, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్బిట్ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని సీజ్ చేసి, యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ AIFDS రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్ధు, AISA జిల్లా కన్వీనర్ బాలు శుక్రవారం ప్రాంతీయ తనిఖీ అధికారి (RIO), ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యాసంస్థలను నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమే కాకుండా విద్యా చట్టాలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. అనుమతులు లేకుండానే విద్యార్థులను చేర్చుకోవడం, ఫీజులు వసూలు చేయడం, తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించడం వంటి చర్యలను ఉపేక్షించరాదన్నారు. ఆర్బిట్ బాలికల జూనియర్ కళాశాలపై ప్రత్యేక తనిఖీ బృందాన్ని నియమించి, అనుమతులు, అధ్యాపకుల అర్హతలు, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రవేశాలు, ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

విచారణలో అక్రమాలు తేలితే కళాశాల గుర్తింపును వెంటనే రద్దు చేయడంతో పాటు యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అక్రమంగా వసూలు చేసిన ఫీజులను విద్యార్థులకు తిరిగి చెల్లించి, వారి విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కళాశాలలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో AISA--AIFDS ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, కళాశాల ముట్టడులు చేపడతామని హెచ్చరించారు.

# ఇందూరు ఊర పండగ ఏర్పాట్లను పరిశీలించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య



నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) జూలై 31:

రాబోయే ఆదివారం నిర్వహించనున్న ఇందూరు నగర ప్రసిద్ధ ఊర పండగను పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ శుక్రవారం నాడు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. పండుగను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఆయన అధికారులతో కలిసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. విగ్రహాల తయారీ కేంద్రాల పరిశీలన పర్యటనలో భాగంగా సిపి ముందుగా నగరంలో ప్రతిష్ఠించనున్న అమ్మవార్ల విగ్రహాల తయారీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానిక కళాకారులతో మాట్లాడి, విగ్రహాల తయారీ పురోగతిని, ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. శోభాయాత్ర మార్గాల తనిఖీ అనంతరం ఊర పండగ సందర్భంగా నిర్వహించే ప్రధాన శోభాయాత్ర సాగనున్న రూట్లను సిపి పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భారీ బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. శోభాయాత్ర సమయంలో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిర్నపల్లి గడిలో సర్వ సమాజ్ సమితితో సమావేశం తదనంతరం సిపి సాయి చైతన్య సిర్నపల్లి గడికి చేరుకుని అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ సమితి ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఊర పండగ నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. పండుగ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిపి స్పష్టం చేశారు. పాల్గొన్న ప్రముఖులు ఈ క్షేత్రస్థాయి పర్యటనలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, టౌన్-1 ఎస్‌హెచ్‌వో రఘుపతి, రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, టౌన్-4 ఎస్ఐ యాదగిరి గౌడ్, సర్వ సమాజ్ కన్వీనర్ రమర్తి గంగాధర్, కార్యదర్శి బట్టు రాజేశ్వర్, సర్వ సమాజ్ సభ్యులు మరియు భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఘన వీడ్కోలు




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 31: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై నెలలో పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. సుదీర్ఘ సేవలు అందించి విరమణ పొందిన అధికారులు:వి. ఇన్‌స్పెక్టర్ శివరాం: జాల్కంపేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన వీరు పోలీస్ శాఖలో 42 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందారు. ఆర్ఎస్ఐ చిట్టమల్ల ముత్తయ్య: ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన వీరు 36 సంవత్సరాల సుదీర్ఘ సేవను పూర్తి చేసుకొని విరమణ పొందారు. ఏఆర్ ఎస్ఐ కంతెదారి లక్ష్మణరావు: ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహించిన వీరు 42 సంవత్సరాల పాటు శాఖకు సేవలు అందించి పదవీ విరమణ చేశారు.

ఎలాంటి ప్రతికూల రికార్డు లేకుండా విరమణ చేయడం గొప్ప విషయం: సీపీ ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఉండే తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటూ, ఎలాంటి ప్రతికూల రికార్డు (రిమార్క్) లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజమైన ప్రక్రియేనని, అయితే వారు శాఖకు అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా సదరు అధికారులకు పోలీస్ శాఖ నుండి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని సీపీ హామీ ఇచ్చారు. విరమణ పొందిన అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, వారి పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. హాజరైన అధికారులు:ఈ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ శ్రీరాములు, ఆఫీస్ సూపరింటెం డెంట్లు శంకర్, ఏ. జగతి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) ధరణి కుమార్, ఎంపీఓ ఎస్. శేఖర్ బాబు, వెల్ఫేర్ హోంగార్డ్స్ సతీష్‌తో పాటు పదవీ విరమణ పొందిన అధికారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్లూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

### దళిత సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దు: సర్పంచ్, ఆర్ఐ

### 'మన ఊరు - మన భద్రత'లో హెల్మెట్ ధారణపై పోలీసుల అవగాహన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 31:

వేల్పూర్ మండలంలోని అక్లూర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ కులాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు, రక్షణ చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. దళితుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల వివరాలను, వాటికి దరఖాస్తు చేసుకునే విధానాన్ని ఆయన వివరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ జిన్నా జనార్ధన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) గోపాల్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళితుల రక్షణ కోసం ఉన్న అట్రాసిటీ చట్టాన్ని ఎవరూ వ్యక్తిగత కక్షల కోసం దుర్వినియోగం చేయవద్దని, ప్రభుత్వం కల్పించే పథకాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని కోరారు. గంజాయికి యువత దూరం ఉండాలి హెడ్‌కానిస్టేబుల్ నారాయణఇదే వేదికపై మండల పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో 'మన ఊరు - మన భద్రత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ (హెచ్ సి) నారాయణ మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేనిదే బైక్‌లు నడపవద్దని భద్రతా నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీపీఓ పొలాస స్వాతి, పంచాయతీ కార్యదర్శి మహేష్, వేల్పూర్ పోలీస్ సిబ్బంది, మాల కుల పెద్దమనుషులు మరియు గ్రామ కులస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని కలిసిన పోచంపల్లి నూతన ఎస్సై జగన్



భుదాన్ పోచంపల్లి జులై 31 (ప్రజా కలం )

శాంతి భద్రతలకు ఆటంక కలగకుండా చూడాలని ప్రజలు ఫిర్యాదులు నేరుగా స్వీకరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎస్సై జగన్ తో అన్నారు. ఇప్పుడు వచ్చే బోనాల పండుగలో ప్రజలు శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా, పోలీస్ సిబ్బందికి సహకరించాలని అన్నారు. ఎవరు తప్పు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తగు సూచనలు ఇచ్చారు.

# సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు:

## అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి,.

సంగారెడ్డి ప్రతినిధి జులై 31( ప్రజా కలం ): శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుండి 31 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్--1861 అమలులో ఉంటుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా అదనపు ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసిన ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జూలై 31, (ప్రజా కలం )

ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.



## ఎల్‌బీ నగర్, వనస్థలిపురం లో

# అక్రమ నిర్మాణాల జోరు

### - చూసీ చూడనట్లు మున్సిపల్ అధికారులు?

### - వనస్థలిపురం--బీఎన్ రెడ్డి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు.. చర్యలు ఎక్కడ?

**ఎల్‌బీ నగర్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)**

ఎల్‌బీ నగర్ జోన్ పరిధిలోని వనస్థలిపురం, బీఎన్ రెడ్డి, హయత్‌నగర్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్ఎఫ్ కాలనీలో నిబంధనల ఉల్లంఘన?**

వనస్థలిపురంలోని ఎస్ఎఫ్ కాలనీలో సెట్‌బ్యాక్ నిబంధనలను పాటించకుండా అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం బహిరంగంగానే కొనసాగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు.

**సామాన్యులకు ఒక న్యాయం..**
**అక్రమ నిర్మాణాలకు మరో న్యాయమా?**

సాధారణ ప్రజలు చిన్నపాటి నిబంధనల ఉల్లంఘన చేసినా వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకునే అధికారులు, భారీ అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం మౌనం పాటించడం వెనుక కారణమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలు**

ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్ రెడ్డి ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు, కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మాణం జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**టౌన్ ప్లానింగ్ పర్యవేక్షణ శూన్యమా?**

అక్రమ నిర్మాణాలను గుర్తించడం, తనిఖీలు నిర్వహించడం, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రధాన బాధ్యత. అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు ఏదో ఒక కాలనీలో అనుమతులు లేని నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని అంటున్నారు.

**అక్రమ వసూళ్ల ఆరోపణలు**

కొంతమంది సిబ్బంది, మధ్యవర్తులు అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ "అన్నీ మేమే చూసుకుంటాం" అంటూ ఇంటి యజమానుల నుంచి భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వస్తే నోటీసుల పేరుతో మరిన్ని వసూళ్లు చేస్తున్నారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.

**జోనల్ కార్యాలయంలో పర్యవేక్షణ ఉందా?**

ఎల్‌బీ నగర్ జోనల్ కార్యాలయం పరిధిలో ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడుందనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ కార్యాలయం ఈ అంశంపై దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## మైనంపల్లికి మల్కాజిగిరి బోనాలకు ఆహ్వానం

### మైనంపల్లి చొరవతో మల్కాజిగిరి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ బోనాల పండుగకు 5 లక్షల నిధులు ఇవ్వాలని దేవాదాయ శాఖ మంత్రికి మైనంపల్లి ఫోన్,

మల్కాజిగిరి జూలై31,(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ బోనాల పండుగకు 5 లక్షల రూపాయలు మంజూరు చేయండి అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కోరారు. మల్కాజిగిరి శ్రీ ఉ



జ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ వారు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును వారి నివాసంలో కలసి ఆగస్టు 9న మల్కాజిగిరి లో జరిగే శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాలకు ఆహ్వానాన్ని ఆలయ కమిటీ వారు అందించారు.గతంలో ఆలయ బోనాల పండుగకు రహ2 లక్షల 20 వేల రూపాయలను అందించారని ఈసారి నిధులను పెంచేలా చూడాలని మైనంపల్లి నీ కోరడంతో వెంటనే స్పందించిన మైనంపల్లి హనుమంతరావు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఫోన్ లో మాట్లాడి,రిక్వెస్ట్ లెటర్ ను కూడా రాశారు. మల్కాజిగిరి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి మల్కాజిగిరి లో పేరు ఉన్న ప్రధాన దేవాలయము కనుక నిధులు పెంచాలని లెటర్ లో కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రి 5 లక్షల రూపాయలు అందేలా చూస్తానని చెప్పినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.మైనంపల్లి హనుమంత రావు గారు చూపిన చొరవతో ఆలయ కమిటీ వారు కృతజ్ఞతలు చెప్పారు.

## రోడ్డు చూస్తే ఇలా ప్రయాణించేది ఎలా

### గుంతల రోడ్డుతో ప్రయాణికులకు నరకం

### సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, జూలై 31, (ప్రజా కలం)

రోడ్డు చూస్తే ఇలా ప్రయాణించేది ఎలా అని సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం అల్మాస్గూడ కమాన్ మొదలుకొని మెయిన్ రోడ్ గుంతల మయము జనానికి నరకం చూపిస్తున్న రహదారులు జిహెచ్ఎంసి బడంగ్పేట్ కమిషనర్ దయచేసి మీరు రోడ్డుపై పిల్లలు పెద్దలు ఉద్యోగస్తులు హాస్పిటల్ కి వెళ్లేవారు వృద్ధులు పింఛన్ల కోసం తీసుకునేవారు అదే రోడ్డుపై నడవాలి పన్నుల రూపంలో వసూలు చేసి ఇతర పనులకు ఉపయోగించకుండా శ్రీ సాయి బాలాజీ టోన్ షిప్ ఫేస్ 2. మెయిన్ రోడ్ బడంగ్పేట్ మున్సిపల్ ఆఫీసుకు పోయి రోడ్డు పై వాహనదారులు కిందపడి గాయాలపాలై వాహనాలకు రిపేరు వచ్చి నాన్న ఇబ్బందులు పడుతూ తప్పుదు మనకు ఏ ప్రభుత్వమైనా ప్రజల బాగోవులు చూడడం లేదని వాపోతున్నారు. దయచేసి జిహెచ్ఎంసి వారు త్వరలో రోడ్డు మరమతులు చేపట్టి గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేయాలని. ఈ ప్రభుత్వానికి ఓటు వేసిన ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని విజ్ఞప్తి. చేశారు.



## మహేశ్వరంలో పడకేసిన పారిశుద్ధ్యం

### - ప్రభుత్వ కార్యాలయాల పక్కనే చెత్త కుప్పలతో స్వాగతం
### - ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజలకు భరించలేని దుర్వాసన
### -వర్షాకాలంలో అంటువ్యాధులు భయంతో గ్రామ ప్రజలు

మహేశ్వరం, జూలై 31, (ప్రజా కలం )

మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో రోడ్డు పక్కనే చెత్త వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహేశ్వరంలో పారిశుద్ధ్యం పడకేసిందని అనుమానం కలుగుతుంది. కేబీ తండా నుంచి మహేశ్వరం వచ్చే ప్రధాన రహదారిపై మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కోర్టు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమీపంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వందలాది మంది ప్రజలు దుర్వాసనతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. కార్యాలయాల పరిసరాల్లో పరిశుభ్రత లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.రోడ్డు పక్కనే చెత్తను బహిరంగంగా వేయడం వల్ల సమీపంలో నివసించే కుటుంబాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మహేశ్వరం మండల కేంద్రానికి శాశ్వత డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి, రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించి పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో వ్యాపారం

### పేదలను మోసం చేయడమేని ఆరోపణలు

### కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె. రామకృష్ణ

కంటోన్మెంట్ఃజులై 31ఃప్రజాకలం ప్రతినిధి

ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలతో వ్యాపారం చేస్తోందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జె. రామకృష్ణ తీవ్రంగా ఆరోపించారు. శుక్రవారం మహేంద్రహిల్స్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా అద్భుతమైన మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. మల్కాజిగిరి పరిధిలోని సర్వే నంబర్ 844/1 కంటోన్మెంట్‌లో ఉండగా, అక్కడ 400 ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వే నంబర్ 74కు సంబంధించి కోర్టు వివాదాలు ఉన్నాయని, హైకోర్టులో కేసు ఓడిపోయినప్పటికీ అక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపడతారో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

పేదలతో వ్యాపారం..

ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజలతో వ్యాపారం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పేదలపై ఆర్థిక భారం మోపుతోందని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఇల్లు మంజూరైన తర్వాత రూ.6 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. 400 చదరపు అడుగుల నిర్మాణంలో భాగంగా పది ఫ్లోర్ల నిర్మాణం చేస్తున్నారని, ఆరు లక్షలు కడితే వచ్చే నెట్ ఏరియా కేవలం 4 లేదా 5 గజాలు మాత్రమే వస్తుందని తెలిపారు. అంటే గజానికి లక్షా 50 వేలు పేద ప్రజలు కట్టాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేద ప్రజలతో వ్యాపారం చేస్తోందా, భూములు అమ్ముతోందా లేక సంక్షేమ పథకం అమలు చేస్తోందా అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

సీవరేజ్ వ్యవస్థ పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించాలి...

టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తామంటే తామే గొప్ప అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయని రామకృష్ణ విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే టీమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. తాను కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో టీమ్స్ ఆసుపత్రి మురుగునీటి వ్యవస్థకు సంబంధించి కంటోన్మెంట్ ప్రాంతంలో సీవరేజ్ ఔట్‌లెట్‌ను అభివృద్ధి చేసి, దానిని జీహెచ్ఎంసీ ఔట్‌లెట్‌కు అనుసంధానం చేయాలనే షరతుతో అనుమతులు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా అన్ని రాజకీయ పార్టీలు కలిసి సీవరేజ్ ఔట్‌లెట్ పనులు పూర్తి చేయాలని, సీవరేజ్ వ్యవస్థ పూర్తయిన తర్వాతే ఆసుపత్రిని ప్రారంభించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

నిధుల విషయంలో వివక్ష

బోనాల పండుగ సందర్భంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆలయాలకు ప్రభుత్వం తక్కువ నిధులు కేటాయిస్తూ వివక్ష చూపుతోందని రామకృష్ణ ఆరోపించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆలయాలకు ఒక విధంగా, కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆలయాలకు మరో విధంగా నిధులు కేటాయించడం సరికాదన్నారు. కంటోన్మెంట్‌లోని ఆలయాలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే ఇస్తుండగా, ఇతర ప్రాంతాల్లోని ఆలయాలకు కనీసం లక్ష రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంపై ఈ వివక్ష ఎందుకు చూపుతున్నారో ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



## బాబోయ్ కుక్కలు భయాందోళనలో గ్రామ ప్రజలు

### -మహేశ్వరంలో వీధి కుక్కల స్వైర విహారం
### -ప్రధాన చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులను వెంటాడుతున్న కుక్కలు
### -చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్న స్థానికులు

మహేశ్వరం, జులై 31, (ప్రజా కలం )

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి.ప్రధాన చౌరస్తా, రద్దీ రహదారులు, కాలనీల్లో తిరుగుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటాడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో కొందరు వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రధాన చౌరస్తా మీదుగా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సమయంలో కుక్కలు ఒక్కసారిగా వాహనాల వెనుక పరుగులు తీయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అంటున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు కూడా వీధి కుక్కల సంచారంతో అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.రాత్రి వేళల్లో కూడా పలు ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయని చెబుతున్నారు.ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ప్రమాదాలు జరగకముందే వీధి కుక్కలను పట్టుకుని సంబంధిత డాగ్ షెల్టర్‌కు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.మహేశ్వరం మండల కేంద్రంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రధాన చౌరస్తా, పాఠశాలలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కుక్కకాటు సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.



## ఆగస్టు 25 కు ఫార్ములా-ఈ కేసు వాయిదా

### నాంపల్లి ఏసీబీ కోర్టు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్..
### రాజకీయ లబ్దికోసమే తప్పుడు కేసులని వ్యాఖ్య
### లక్షరూపాయల వ్యక్తిగత పూచీ..

**హైదరాబాద్, జూలై 31 (ప్రజా కలం ప్రతినిధి)**

రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతల పై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామా రావు స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేసు కేసులో విచారణ ఎదురుకుంటున్న ఆయన శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోర్టు ఆదేశాల మేరకు కేటీఆర్ రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తు సమర్పించినట్లు తెలిపారు. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసిందన్నారు. వాయిదా రోజు రూ.1 లక్ష చొప్పున మరో రెండు పూచీకత్తులను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ లీగల్ టీం మాట్లాడుతూ, ఈరోజు విచారణలో కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్‌తో పాటు ఇతర పత్రాలను మాత్రమే అందజేశారని, కేసు మెరిట్స్‌పై ఎలాంటి విచారణ జరగలేదని స్పష్టం చేసింది. కేటీఆర్ తన నివాసం నుంచి నాంపల్లి కోర్టుకు చేరుకోగా, ఆయన వెంట పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, న్యాయవాదులు కోర్టు ప్రాంగణానికి చేరుకుని కేటీఆర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

అంతిమ విజయం సత్యమే...

కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కుట్రపూరితంగానే అక్రమ కేసులు పెట్టినట్లు ఆయన ఆ సందర్భంగా మండిపడ్డారు. ప్రజల తరఫున తాము చేసే పోరాటాలను ఇటువంటి తప్పుడు కేసులు ఎంతమాత్రం ఆపలేవని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని కేటీఆర ధీమా వ్యక్తం చేశారు.యూకేకు చెందిన ఫార్ములా–ఈ ఆర్గనైజేషన్‌కు నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్లు మళ్లించారనే అభియోగాల పై ఏసీబీ ఈ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com